ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 279 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | సోమవారం 5 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### గిగ్ కార్మికుల సామాజిక భద్రతకు 90 రోజుల పని నిబంధన

కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు సంబంధించిన సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద మొత్తం 120 రోజులు పనిచేయాలి.

### రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి

అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల డియా కథనాలు వెల్లడించాయి.

## నల్లమల సాగర్‌పై సుప్రీంకోర్టులో 5న విచారణ..

# సీఎం కసరత్తు



- సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం
- రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలి
- అవసరమైన అన్ని ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలి
- నీటిపారుదలశాఖ అధికారుల అప్రమత్తం

హైదరాబాద్

పోలవరం – నల్లమలసాగర్ లింక్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ముంబయిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు. అవసరమైన అన్ని ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే ఈ పనులు ఆపేలా ఆదేశించాలని కోరింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కాదని, తెలంగాణ - మిగతా3లో



## వెనెజువెలాలో పరిస్థితులు ఆందోళనకరం

- ప్రజల శ్రేయస్సు, భద్రతకు మా మద్దతు: భారత్

జవెనెజువెలాలో నెలకొన్న పరిణామాలపై స్పందించిన భారత్

- నిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ వెల్లడి
- ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొనేలా సమస్యలను సంభాషణల ద్వారా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అన్ని పక్షాలను కోరుతున్నాం‘

## ‘అసెంబ్లీలో బీఆర్ఎస్ బాయ్‌కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా?



- హరీశ్‌రావులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్
- పాలమూరు–రంగారెడ్డి విషయంలో ప్రభుత్వం అడ్డగోలు అబద్ధాలు
- సూర్యాపేటలో తెలంగాణ జాగృతి నేతలతో కవిత సమావేశం
- కేసీఆర్‌ను అవమానిస్తే నేను రియాక్ట్ అయ్యా, మీరేందుకు కాలేదు
- “వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక్క మాట అన్నందుకు అసెంబ్లీని బాయ్‌కాట్ చేస్తారా?

హైదరాబాద్

పాలమూరు–రంగారెడ్డి విషయంలో అసెంబ్లీలో ప్రభుత్వం అడ్డగోలు అబద్ధాలు చెప్పిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆల్మట్టి ఎత్తు పెంపు, అప్పర్ భద్రకు జాతీయ హోదాను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కృష్ణానది నీళ్ల అంశంపై చర్చించాలన్నారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన తెలంగాణ జాగృతి నేతల సమావేశంలో - మిగతా3లో



## అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం!

- కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీకి ప్రియాంక గాంధీ సారథ్యం
- అసోం అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ సన్నద్ధం
- ప్రియాంక గాంధీ సారథ్యంలో అభ్యర్థుల ఎంపిక
- అసోం, బంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి కోసం కమిటీలు ఏర్పాటు



## ‘ఒలింపిక్స్-2036’ క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం

- అండర్–17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చింది
- 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయి
- 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది
- ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుంది

# ఫిబ్రవరిలో పురపోరు

- మున్సిపాలిటీ ఎన్నికలకు జోరుగా ఏర్పాట్లు
- “పంచాయతీ‘కి పల్లెల్లో ఓటు వేశారు
- ఇప్పుడు ‘పట్టణా‘ల్లోనూ ఓటు వేయిద్దాం‘
- త్వరలోనే మున్సిపాలిటీ ఎన్నికల షెడ్యూల్
- స్థానిక సంస్థలకు ఎన్నికలు పూర్తి చేయాలి
- ఈ నెల 10న ఓటర్ల తుది జాబితా
- ఆందోళన కలిగిస్తున్న బోగస్ ఓటర్లు
- అప్పుడే కేంద్రం గ్రాంట్లు విడుదల చేసేందుకు సాధ్యమవుతుంది.
- 3న జడ్చర్లలో ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేయనున్న సీఎం
- ఆ తర్వాత జిల్లాల టూర్.. రెండేళ్లలో టచ్ చేయని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే యోచన

## సంక్రాంతికి ముందు లేదా తర్వాత షెడ్యూల్ ప్రకటన రాష్ట్ర ఎన్నికల సంఘానికి సర్కార్ గ్రీన్‌సిగ్నల్!





పురపాలికల ఎన్నికలు వచ్చే నెల రెండో వారంలో ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో ప్రస్తుత ఓటర్ల జాబితాలో లేని వారిని గుర్తించి కొత్తగా ఓటర్లను నమోదు చేసేందుకు ఆశావహులు కసరత్తు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్న వారిని పట్టణాల్లోకి మార్చే పనిలో వారంతా నిమగ్నమయ్యారు. ఆధార్‌కార్డులు, వివరాలు సేకరించి మీసేవ కార్యాలయాలు, ఆన్‌లైన్ సెంటర్లలో నమోదు చేసుకుంటున్నారు. అయితే ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వాల్సి ఉంది. దీనికి అదనంగా ఓటరు జాబితా వస్తోంది. దాని ఆధారంగానే ఓటు వేసేందుకు వీలు ఉండనుంది.

3



## రేవంత్‌ది కట్టుకథ.. కుట్రతో ప్రాజెక్ట్‌ల నిర్లక్ష్యం

- నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్ పార్టీనే
- ‘అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పార్టీ.
- గోదావరి–బనకచర్ల ప్రాజెక్ట్‌కు లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు.
- కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద సీఎం రేవంత్ కక్ష గట్టారు
- పాలమూరుపై పగబట్టారు. కాంగ్రెస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటోంది

హైదరాబాద్

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుకథలు చెప్పారని ఆరోపించారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అంటూ ఘాటు విమర్శలు చేశారు. నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్ పార్టీనే అంటూ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై బీఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తోంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ‘అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పార్టీ. నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్ పార్టీనే. విభజనలో సెక్షన్–84 పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారు. 11వ షెడ్యూల్‌లో మన ప్రాజెక్ట్‌లను ఎందుకు పెట్టలేదు?. కాంగ్రెస్ చేసిన ద్రోహాలను కప్పిపుచ్చుకున్నారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్ట్‌లను 11వ షెడ్యూల్‌లో పెట్టకపోగా విభజన చట్టంలో రక్షణ కల్పించామని సీఎం చెబుతున్నారు. - మిగతా3లో

## సంపాదకీయం

# కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అగ్రరాజ్యం అమెరికా విదేశీ ఉద్యోగులను తగ్గిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా వెళ్లాలని భావిస్తున్న ప్రయాణికులకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేలా టూరిస్ట్ వీసా ఫీజులను యూఎస్ భారీగా పెంచింది అన్న వార్తలు ఇప్పుడు హల్చల్ చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా భారతీయులు, విద్యార్థులు, పర్యాటకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక విదేశీ ఉద్యోగులపై కక్ష గట్టాడు. ముఖ్యంగా భారతీయులను వెళ్లగొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.నూతన సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ మార్పులు అమల్లోకి తీసుకువచ్చినట్లు చెప్తున్నారు. దీని ప్రకారం ఇప్పటివరకు 17 వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లిస్తే, ఇకపై 40వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లించాలి. కానీ ఇందులో కొంత ఉపశమనం ఇచ్చే వార్త కూడా యూఎస్ ప్రభుత్వం చెప్పింది, ఎవరైతే యూఎస్ వెళ్లి తిరిగి చెప్పిన సమయంలోనే తిరిగి వస్తారో వారికి వీసా ఇంటిగ్రిటీ ఫీజుగా వసూలు చేసే 250 డాలర్లు తిరిగి ఇస్తారని చెప్తున్నారు.అయితే యూఎస్ తాజా నిర్ణయం అయిన వీసా ఫీజుల పెంపుతో విదేశీ ప్రయాణ ఖర్చులు మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికే విమాన టికెట్లు, హోటల్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ముఖ్యంగా అమెరికాకు టూరిజం, బిజినెస్, కుటుంబ సభ్యుల సందర్శన కోసం వెళ్లే వారికి ఈ నిర్ణయం ఇబ్బందికరంగా మారింది. డాలర్ డ్రీమ్స్! అమెరికాలో ప్రస్తుతం ఉత్పన్నం అవుతున్న పరిస్థితులు.. భారతీయ మిడిల్ క్లాస్ ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ విషయం అందరూ పదేపదే చర్చించుకుంటున్నారు. అయితే.. ఎందుకు ఆందోళన చెందాలి? అనేది ముందుగా మనం ఆలోచించాలి. అమెరికాలో ఉద్యోగాలు ఇక తగ్గిపోతాయనే భయం, అమెరికాకు చేసే ఎగుమతులు మందగిస్తాయనే భయం.. మిగిలిన యావత్ ప్రపంచాన్ని కూడా ఆందోళనకు గురిచేస్తుండవచ్చు. కానీ కొంచెం లోతుగా, భిన్నంగా ఆలోచిస్తే ఇవన్నీ కూడా అర్థం లేని భయాలే అనిపిస్తుంది. అధిక సంపాదన, అధిక లాభాలు.. ఇలా 'అధిక' అనే పదాన్ని పట్టించుకోకపోతే గనుక.. ఇక ఎవ్వరికీ ఏ చింతా లేదు. నిజానికి ఈ భయాలు మనం పరాధీనులుగా మారిపోతున్నామా అనే అనుమానాన్ని మనకు కలిగిస్తున్నాయి. అమెరికాలో చదువులకోసం లక్షలు కాదు కదా.. కోట్ల రూపాయలు అయినా ఖర్చు పెట్టడానికి మిడిల్ క్లాస్ కూడా సిద్ధమవుతున్నారు. అందరిలోనూ ఇప్పుడు ఆందోళనే.అమెరికాలో పై చదువుల కోసం వెళ్లే వారు నిజంగానే చదువు మీద శ్రద్ధతో వెళుతున్నారా? 'భారత దేశంలో దొరకని నాణ్యమైన విద్య నేర్చుకోవచ్చు' అనే నమ్మకంతో వెళుతున్న వారు ఎందరు? కనీసం ఒక్క శాతం అయినా కేవలం ఇక్కడ నేర్చిన విద్యను మరింత మెరుగుపరుచుకోవడానికి మాత్రమే అమెరికాకు వెళ్లి రావాలని అనుకునే వాళ్ళు ఉన్నారా? ఈ ప్రశ్నలకు ఉన్నారని జవాబు చెప్పడం చాలా కష్టం. అమెరికా చదువుల కోసం వెళు తున్న వారిని కదలిస్తే.. అక్కడి డాలర్ల సంపాదన గురించి.. ఇక్కడకు అక్కడకు సంపాదనలో ఉండే తేడా గురించిన ఆశ కనిపిస్తున్నదే తప్ప.. అక్కడి చదువులు తమను ఎంత పదును పెడుతున్నాయనే చర్చ ఎప్పటికీ ఉండదు.అమెరికాలో చదువుకోవడానికి వెళుతున్న విద్యార్థులు కూడా అన్ని రకాల నిబంధనలను అతిక్రమించి.. చిరుద్యోగాలు, కూలిపనులు చేసుకుంటూ డాలర్లు సంపాదించడానికి వెళ్లిన తొలిరోజునుంచి దృష్టి పెడుతుండడాన్ని కూడా మనం గమనినంచాలి. ట్రంప్ సుంకాలు విధించినప్పటినుంచి భారత్ నుంచి ప్రధానంగా ఫార్మా, ఆక్వా తదితర రంగాలు ప్రభావితం అవుతాయని అంతా అంచనా వేస్తూ వచ్చారు. ఈ రంగాలు దెబ్బతింటాయని, ఎగుమతులు తగ్గుతాయని, ఆ పరిశ్రమల మీద ఆధారపడిన వేలమంది జీవితాలు గందరగోళంలో పడతాయని రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తూ వస్తున్నాయి. అయితే ఈ రంగాలతో సంబంధం లేని, అమెరికా పరిణామాలతో సంబంధంలేని సగటు భారతీయుల వాదన మరోరకంగా వినిపిస్తూ ఉంటుంది.ఆక్వారంగమే తీసుకుందాం. అమెరికా ఎగుమతుల పుణ్యమాని.. వేల ఎకరాల సారవంతమైన పంట భూములు చేపల, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. దీని వల్ల.. భూసారం దెబ్బతింటోంది. పర్యావరణానికి అనన్యమైన హాని జరుగుతోంది. భూగర్భజలాలు కూడా నాశనం అవుతున్నాయి. రకరకాల కాలుష్యాలు పెరుగుతున్నాయి. ఇదంతా పర్యావరణ వేత్తలు ఆక్వారంగం విశ్వరూపం గురించి వెలిబుచ్చే ఆవేదనలు. అదేసమయంలో సగటు వ్యక్తుల వాదన ఇంకోటి కూడా ఉంది. మన ఆక్వా ఉత్పత్తుల్లో అత్యంత నాణ్యమైన రొయ్యలను భారతీయ మార్కెట్ కు అస్సలు అందుబాటులో ఉంచకుండా పూర్తిగా ఎగుమతులు చేసేస్తున్నారనేది ఒక వాదన. ఇక్కడి నేలలను నిస్సారం చేస్తున్నారు.. ఇక్కడి వనరులను వాడుకుంటున్నారు. ఇక్కడి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. అంతా కలిపి వాటిని తినే భాగ్యం మాత్రం విదేశాలకే ఉండాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.. అని వారు వాదిస్తున్నారఇప్పుడు ఈ సుంకాలు ఆక్వా పరిశ్రమ మీద ప్రభావం చూపిస్తే.. ఆ రంగం తక్కువ నష్టాలతో బయటపడడానికి వేరే ప్రత్యామ్నాయమే లేదా? అనేది ప్రధానంగా ఆలోచించాల్సిన సంగతి. ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకుంటే మాత్రమే అధిక లాభాలు దక్కుతాయా? భారతీయ మార్కెట్ ఎప్పటికీ.. తమ నాణ్యమైన రొయ్యలను కొనుగోలు చేసే శక్తితో లేదని వారు అనుకుంటున్నారా? అనేవన్నీ కూడా చర్చకు రావాల్సిన అంశాలే. ఏదిఏమైనప్పటికీ మోడీ చెప్పిన మాట నిజం. ఇతరులమీద ఆధారపడడం అనేదే మనకు అసలైన శత్రువు. రొయ్యల పరిశ్రమకు సంబంధించిన వారు కూడా స్వదేశీ మార్కెట్ ద్వారానే గరిష్టమైన లాభాలు సంపాదించుకోవడం ఎలాగో అన్వేషించగలిగిన నాడు.. ట్రంప్ కాదు కదా.. అంతకంటె బలమైన, అంతకంటె క్రూరమైన ప్రపంచ పాలకుడు మరొకడు అవతరించినా కూడా.. మనల్ని ఎలాంటి ఒత్తిడికి గురిచేయలేడు అనేది వాస్తవం.కొంచెం పచ్చిగా చెప్పుకోవాలంటే.. అక్కడ ఎమ్మె?స్ డిగ్రీ చేయడం అనేది.. అక్కడ ఉద్యోగం దొరకబుచ్చుకోవడం కోసం ఒక సాకు మాత్రమే. ప్రధాన లక్ష్యం.. సంపాదనే. ఆ క్లారిటీ అందరికీ ఉన్నది గనుకనే.. తొలినాటినుంచి సంపాదన మీద దృష్టిపెడుతూ వస్తున్నారు.ఈ క్రమంలో హెచ్?1బీ వీసా నిబంధనలు కఠినతరం చేశారు. వీసా ఫీజు రూ.లక్ష డాలర్లకు పెంచారు. తాజాగా వీసా కేటాయింపు ప్రక్రియలో ర్యాండమ్ లాటరీ వ్యవస్థను మార్చి, వేతనం, నైపుణ్యాల ఆధారంగా జారీ చేయాలని నిర్ణయించారు. ఈ మార్పులు ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురితమయ్యాయి. 2027 ఆర్థిక సంవత్సరం క్యాప్ రిజిస్ట్రేషన్ నుంచి అమలవుతాయి. ఇకపై అధిక వేతనాలు పొందే నిపుణులకు ఎంపిక అవకాశాలు గణనీయంగా పెరుగుతాయిఅమెరికా కార్మిక శాఖ, హెచ్?1బీ ఉద్యోగుల వేతనాలను నాలుగు లెవల్స్‌గా వర్గీకరించింది.ఎంట్రీ?లెవల్ వర్కర్లు ? ర్యాండమ్ లాటరీలో ఒక్కసారి మాత్రమే పాల్గొంటారు (ఛాన్స్ 15% తగ్గుతుంది)మధ్యస్థ నైపుణ్యం ? రెండుసార్లు ఎంపిక అవకాశం (31% ఛాన్స్).అధిక నైపుణ్యం ? మూడుసార్లు ప్రవేశం (46% అవకాశం).అత్యధిక వేతనం ? నలుసార్లు లాటరీలో పాల్గొనవచ్చు ( (61% ఎంపిక ఛాన్స్).హెచ్?1బీ/హెచ్?4 అపాయింట్‌మెంట్ ఆలస్యాలతో భారతీయ

# ప్రపంచంలోని అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన శాస్త్రీయ వాది, మేధావి లూయిస్ బ్రెయిలీ



ప్రపంచంలోని అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన శాస్త్రీయ వాది, మేధావి లూయిస్ బ్రెయిలీ.. ఆయన ఫ్రాన్స్ దేశంలో పారిస్ నగరానికి 20 మైళ్ళ దూరంలోనున్న మారుమూలలో నున్నటువంటి రాన క్రూవె గ్రామంలో మౌనిక్ సైమన్ దంపతులకు జనవరి 4, 1809లో జన్మించారు. దారిద్ర్య రేఖకు మైళ్ళ దూరంలోనున్న నిరుపేద కుటుంబం, మౌనిక్ సైమన్ దంపతులకు ముగ్గురు సంతానంలో చివరి వాడే లూయిస్ బ్రెయిలీ. మౌనిక్ సైమన్ దంపతులు వృత్తిరీత్యా చర్మకారులు. లెదర్ ఉపయోగించి జీన్లు, రకాల సామాగ్రి తయారుచేసి చుట్టుపక్క ఊళ్లల్లో అమ్ముకుంటూ పోషణ సాగించేవారు. లూయిస్ బ్రెయిలీ చాలా చురుకైనవాడు. మూడు సంవత్సరాల వయసున్నప్పుడే వాళ్ళ అన్న పుస్తకాలు చదివేవాడు. తన తండ్రితో ఒక రోజు గుర్రపు జీన్లు తయారుచేసుకునే వాళ్ళ షాపుకు వెళ్ళాడు. అక్కడున్న పదునైన చువ్వ, కత్తులతో తండ్రిని అనుకరిస్తున్నాడు. తండ్రి కూడా పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఈసారి మాత్రం పదునైన కత్తి నాన్నను అనుకరిస్తూ ఉన్న క్రమంలోనే ఎగిరి వచ్చి ఒక కంటిలో గుచ్చుకుంది. స్థానిక హాస్పిటల్‌లో వైద్యునికి తల్లిదండ్రులు చూపించారు. బీదరికం కారణంగా మంచి వైద్యం అందిచ లేకపోవడంతో కంటిచూపు మొత్తం పోయింది. మొదట ప్రమాదానికి గురైన కన్ను కొంత కాలానికే ఇన్‌ఫెక్షన్ అయి రెండవ కంటిచూపు తన 5వ ఏట పూర్తిగా కోల్పోయి అంధత్వానికి దారితీసింది. అందరిలాగానే తన కొడుకు చదువుకోవాలనే ఆశయంతో మౌనిక్ సైమన్ దంపతులు లూయిస్ బ్రెయిలిని అక్క అన్నతో పాటుగా వారి గ్రామంలో నున్న పాఠశాలకు పంపించారు. ఆ పాఠశాలలో బ్రెయిలీ కనబరిచిన అద్భుత ప్రతిభను గమనించిన తన తండ్రి చెక్కపై మేకుల అక్షరాల రూపంలో బిగించి వాటిని తాకడం ద్వారా బ్రెయిలీకి అక్షర జ్ఞానం కలిగించాడు. చదువుకోవాలనే పట్టుదలను తన తెలివితేటల్ని చూసి ఉపాధ్యాయులే ఆశ్చర్యానికి గురైయ్యేవారు. ప్రపంచంలో మొదటగా 1784లో వాలంటీన్ హావే చేత ప్రారంభం అయిన అంధుల పాఠశాలలో పుస్తకాలు అన్నీ కాగితంపై మేకులతో ఉబ్బెత్తుగా చేసి అంధులు తడిమడం ద్వారా గుర్తుపట్టేట్లు చేసి విద్యాబోధన చేసేవారు. ఈ పుస్తకాలు పెద్దగా బరువుగా ఖరీదైనవిగా ఉండడంవల్ల వీటి ద్వారా విద్యాభ్యాసం సాధ్యపడేది కాదు. దీనితో సంతృప్తి చెందనటువంటి లూయిస్ బ్రెయిలి 1821లో చార్లెస్ బార్ బెరియన్ అను సైన్యాధికారి రూపొందించినటువంటి పాఠశాలలో రహస్య డీకోడ్ భాష ద్వారా సైనికులకు 12 చుక్కలతో మాత్రమే శిక్షణను ఇచ్చేవాడు. బార్ బెరియన్ పాఠశాలలో చేరి 12 చుక్కల లిపితో కొంత కాలం చదువుకొనసాగింది. దానితో సంతృప్తి చెందకుండా దానిపై అనేక పరిశోధనలు చేయడం ప్రారంభించాడు. దాదాపు 11 సంవత్సరాల పరిశోధనల అనంతరం 1832లో అభివృద్ధి చెందిన సరళ పద్ధతిలో చుక్కల లిపిని కనుగొన్నాడు. ఈ లిపికి బ్రెయిలి పేరు మీదగానే నామకరణం చేయడం మూలంగా బ్రెయిలీ లిపి అని పేరు వచ్చింది. లూయిస్ బ్రెయిలీ మేధాశక్తికి బహుమతిగా నేషనల్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ నందు ప్రొఫెసర్ పోస్టుకు 1833లో ఎంపికయ్యారు. లూయిస్ బ్రెయిలి విద్యార్థులకు హిస్టరి, ఆల్‌జిబ్రా, చరిత్ర పాఠ్యాంశాలు బోధించేవారు. 1831లో 6 చుక్కల లిపిని కనుగొన్నప్పటికి కూడా ప్రశాంతంగా ఉండకుండా నిరంతరం శ్రమిస్తూ 1839లో సున్నితమైన సులభతరమైన డెకాపాయింట్ అను కొత్త పద్ధతిని ఉపయోగించి పేపరుపై రంధ్రాలు సులభంగా చేసే పద్ధతిని కనిపెట్టి బ్రెయిలీ లిపిని అభివృద్ధి పరిచాడు. లూయిస్ మంచి సంగీత విద్వాంసుడు. ఇతను 1834 - 1839 వరకు ఫ్రాన్స్ దేశంలోనున్న చర్చిల్లో సంగీత ప్రదర్శనలు ఇచ్చేవాడు. వాలంటీన్ హాలే చనిపోయిన తర్వాత అనంతరం వచ్చిన అంధుల పాఠశాల ప్రిన్సిపల్‌గా వచ్చినటువంటి డాక్టర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, లూయి?సను చరిత్ర పుస్తకాన్ని మొత్తం బ్రెయిలి లిపిలోకి అనువాదం చేసినందుకు తన ఉద్యోగం నుంచి తీసేసాడు. లూయిస్ బ్రెయిలీ కనిపెట్టిన లిపి ప్రస్తుతమున్న కంప్యూటర్ భాషకు వీలుగా రూపొందించబడిందంటేనే లూయిస్ బ్రెయిలీ ముందు చూపు ఎంతో అర్థమవుతుంది. బ్రెయిలీ లిపి కనుగొనబడిన తర్వాత సమాచార రంగంలో అంధులకు విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. లూయిస్ బ్రెయిలీ చనిపోయిన తర్వాత ఆయన గొప్పతనాన్ని గుర్తించిన ప్రపంచ దేశాలు తన పేరు మీద పోస్టల్ స్టాంపులు, కరెన్సీ విద్యా సంస్థలకు, పట్టణాలకు పేర్లను పెట్టుకుంటున్నాయి. మన దేశంలో రెండు రూపాయల కాయిన్‌ను, యుఎ?సఎ ఒక డాలరును, ఫ్రాన్స్, జర్మనీ ప్రపంచ వ్యాపితంగా చెల్లుబాటయ్యే పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. మానసిక సామర్థ్యానికి వైకల్యం అడ్డుకాదని ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చునని అంధుడై అంధుల కోసం ప్రస్తుతం ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానానికి అనుకూలంగా చిన్ననాటి నుంచి అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న లూయి?సను ట్యుబరిక్యులోస్ అను మహమ్మారి వ్యాధి పట్టిపీడించడంతో 1852లో తన సొంత గ్రామం అయిన క్రూవెలో ప్రాణాలు విడిచాడు. లూయిస్ బ్రెయిలీ చనిపోయిన రెండు సంవత్సరాల అనంతరం లిపి ప్రాచుర్యంలోకి వచ్చింది. యూరోపలో 1873 అనంతరం లిపి విస్తరించింది

# ఆరావళి కొండలపై అనకొండల చూపు

సహజ వనరులనేవి దేశ సంపదకు, అభివృద్ధికి నిలయంగా ఉంటాయి. వాటిని ప్రజల అవసరాల మేరకే ఉపయోగిం చాలి. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం దేశ సహజ వనరులైన అడవులను, ఖనిజాలను, గనులను, నదులను చివరికి కొండలను కూడా దేశవిదేశీ బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నది. అందులో భాగమే ఆరావళి కొండల్లో మైనింగ్ తవ్వకాలు. ఈ తవ్వకాలకు వ్యతిరే కంగా గిరిజనులు, గిరిజనేతరులు, పర్యావరణ వేత్తలు సుదీర్ఘ కాలం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఆరావళి కొండలకు ఇచ్చిన నిర్వచనానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆరావళి పశ్చిమ భారతదేశం లోని ఒక పర్వతశ్రేణి. ఇది గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ మీదుగా ఈశాన్యంగా 8 వందల కిలోమీటర్ల మీద విస్తరించి ఉంది. ఇది గొప్ప భౌగోళిక చరిత్రకలిగి ప్రపంచంలోని పురాతన పర్వతశ్రేణుల్లో ఒకటి. వృక్షజాలం, జంతుజాలం, ముఖ్యమైన పర్యావరణ ప్రాంతంగా ఉంది. పాలరాయి, గ్రానైట్, మైకా, రాగి, జింక్, సీసం వంటి ఖనిజాలతో ఆరావళి నిండి ఉంది. ఈ పర్వతాలు పొరుగు ప్రాంతాలకు మంచినీరు అందిస్తాయి. వివిధ కొండలు, కోటలు, దేవాలయాలు, చారిత్రక నిర్మాణాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఈ పర్వతాలు థార్ ఎడారిలోని ఇసుక తుఫాన్లను అడ్డుకుంటాయి. అక్రమ మైనింగ్: గత నాలుగు దశాబ్దాలుగా ఆరావళి కొండల్లో అక్రమ మైనింగ్‌తో పాటు అటవీ నిర్మూలన పెద్ద ఎత్తున జరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కంపెనీలకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. గతంలో అడవి గురించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన నిర్వచనం ఉండటం వల్ల కొన్ని రాష్ట్రాలు మైనింగ్‌ని నిషేధిస్తే, కొన్ని రాష్ట్రాలు అనుమతించాయి. ఈ పరిస్థితి మైనింగ్ మాఫియాకు అనుకూలంగా మారింది. గురుగ్రా, ఫరీదాబాద్, నుహ్, మహేంద్ర గడ్ వంటి నగరాల మాస్టర్ ప్లాన్ కింద వాటిని ఆరావళి పరిధి నుంచి మినహాయించడానికి హర్యానా శాసనసభ 27-2-2019న భూసంరక్షణ చట్టాన్ని సవరించింది. దీనివల్ల ఆరావళి కొండల్లో దాదాపు 25 వేల హెక్టార్ల అటవీ ప్రాంతాలు మైనింగ్ కార్యకలాపాలకు వీలు కల్పించింది. అప్పటికే జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను కూడా చట్టబద్ధం చేసింది. టీవల మోడీ ప్రభుత్వం భూమట్టానికి 100 మీటర్ల లోపు కూడా ఆరావళి పర్వత శ్రేణులను మైనింగ్ లీజుకు ఇచ్చేందుకు నిబంధనలను సడలించింది. 1,47,000 చదరపు కిలోమీటర్లు ఉన్న ఆరావళి శ్రేణుల్లో కేవలం 2% మాత్రమే తవ్వకాలు జరుగుతాయని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చెబుతూ, మైనింగ్ తవ్వకాలను సమర్థించుకున్నాడు. దీనిపై పర్యావరణవేత్తలు సుప్రీం కోర్టుకు వెళ్లగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ, వంద మీటర్ల ఎత్తు లోపు ఉన్న కొండలను, కొండలుగా పరిగణించలేమని అక్కడ మైనింగ్ చేసుకోవచ్చని, మిగతా ప్రాంతంలో మైనింగ్ ని నిషేధించాలని నవంబర్ 2025న తీర్పు ఇచ్చింది. ఆరావళి పర్వత శ్రేణులపై కేంద్ర ప్రభుత్వ, సుప్రీం కోర్టుల నిర్వచనంపై దేశవ్యాప్తంగా ప్రజలు రోడ్లమీదకు వచ్చి ఆందోళనలు చేశారు. రాజస్థాన్‌లో జరిగిన వ్యతిరేక ఆందోళనలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనేక మంది మేధావులు, పర్యావరణ వేత్తలు తప్పుపట్టారు. సుప్రీం కోర్టు తీర్పులు విచిత్రంగా ఉన్నాయి. ఒకసారి ఇచ్చిన తీర్పుకి భిన్నంగా, అదే అంశం మరో తీర్పు ఇవ్వడమే విచిత్రం. 2018లో చట్ట విరుద్ధమైన మైనింగ్‌ను ఆపాలని, అక్రమ మైనింగ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మైనింగ్ ప్రాంతాలను సరిగా గుర్తించాలని, ఆరావళి ప్రాంతంలోని ప్రతి చిన్నరాయి, గుట్ట పర్వతం కిందకే వస్తుందని పేర్కొంది. అక్రమ మైనింగ్ వల్ల రాజస్థాన్, హర్యానాలో 31 కొండలు మాయమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. 2025 మేలో కూడా మైనింగ్‌ని నిషేధించాలని చెప్పింది. అందుకు విరుద్ధంగా నవంబర్ 2025లో తీర్పు ఇచ్చింది. ఇలా పరస్పర విరుద్ధమైన తీర్పులు సుప్రీం కోర్టు నుండి వచ్చాయి. ప్రజా ఉద్యమ నేపథ్యంలో 2025 నవంబర్ లో తాను ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకున్నట్లు తిరిగి సుప్రీం కోర్టు ప్రకటించి మైనింగ్ నిషేధించాలని పేర్కొంది. నెలలోనే రెండు విరుద్ధమైన తీర్పులు సుప్రీం కోర్టు నుంచి వెలువడ్డాయి. ఆరావళిలో మైనింగ్ చేస్తున్న ముఖ్యమైన కంపెనీలు అరవాలి గ్రూప్, ఫ్యాబ్ స్టోన్, హిందూస్థాన్ జింక్, వేదాంత సంస్థలు కాకుండా ఇంకా అనేక పెద్ద, చిన్న కంపెనీలు ఉన్నాయి. అక్రమ మైనింగ్ ఫలితంగా పర్వతాల, అటవీ నిర్మూలనతో పాటు పర్యావరణానికి తీవ్రనష్టం జరుగుతుంది. చిన్న కొండలకు రక్షణ ఉండదు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. థార్ ఎడారి ఇసుక తుఫాన్లకు ప్రజలు గురవు తారు. ప్రజాఉద్యమం మూలంగా మోడీ ప్రభుత్వం మైనింగ్‌ని నిషేధించామని చెప్పినా, సుప్రీం కోర్టు తన తీర్పు ను ఉపసం హరించుకున్నా ఆరావళి పర్వతాలకు ప్రమాదం పొంచే ఉంది. బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే ముఖ్యమని భావించే మోడీ ప్రభుత్వం మైనింగ్ తవ్వకాలను ఆపుతుందని ఆశిం చలేం. సుదీర్ఘ ప్రజాఉద్యమమే మైనింగ్ తవ్వకాలను ఆపగలదు.

# అశాంతి రగిల్చే 'శాంతి' చట్టం!

ఇటీవల అమల్లోకి వచ్చిన "సస్టెనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా చట్టం, 2025"పై పౌర సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టం న్యూక్లియర్ పరిశ్రమలో అసురక్షిత పద్ధతులను ప్రోత్సహిస్తుంది, దీని వల్ల భారతపౌరులు న్యూక్లియర్ విపత్తు ప్రమాదానికి గురవుతారు. అలాగే, న్యూక్లియర్ ప్రమాదాల నుంచి ఉత్పన్నమయ్యే భారీ బాధ్యతలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రమాదం కలిగే అవకాశాలే ఎక్కువ. ఈ చట్టం సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 17(బి)ను తొలగిస్తుంది. ఈ సెక్షన్ సరఫరా చేసిన ఉపకరణాలలో దాగిఉన్న లోపాలు లేదా స్పష్టమైన లోపాల వల్ల ప్రమాదం జరిగితే సరఫరాదారులను జవాబుదారీగా చేసేది. ఇది అమెరికా ఒత్తిడి కింద జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు 23 మే 2025న జారీచేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ దేశీయ న్యూక్లియర్ బాధ్యత నియమాలను అంతర్జాతీయ నిబంధనలతో సమలేఖనం చేయాలని అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్‌ను ఆదేశించారు.ఈ నిబంధన తొలగింపు మునుపటి న్యూక్లియర్ ప్రమాదాల నుంచి వచ్చిన శాస్త్రీయ నేర్పులకు విరుద్ధం. ఇప్పటివరకు జరిగిన మూడు ప్రధాన ప్రమాదాలు-ఫుకుషిమా, చెర్నోబిల్, త్రీ మైల్ ఐలాండ్-లలో డిజైన్ లోపాలు ముఖ్య పాత్ర పోషించినట్లు నిరూపితమైంది. శాంతి చట్టం న్యూక్లియర్ సంఘటనకు గరిష్ట బాధ్యతను 300 మిలియన్ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (సుమారు రూ.4,500 కోట్లు)కు పరిమితం చేస్తుంది. కానీ ఇది ఫుకుషిమా విపత్తు శు భ్రపరచడానికి అంచనా వ్యయంలో సుమారు వెయ్యవ వంతు మాత్రమే. అలాగే చెర్నోబిల్ ప్రమాదంలో గోవా పరిమాణంలో ఉన్న ప్రాంతం నివాస యోగ్యం కాకుండా పోయింది. భారత్ దట్టమైన జనాభా కలిగిన దేశం కావడంతో న్యూక్లియర్ విపత్తు నష్టాలు మరింత తీవ్రంగా ఉండవచ్చు. ఈ స్వల్ప బాధ్యత పరిమితి అటువంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి అపర్యాప్తం. ఈ మొత్తం కేంద్ర ప్రభుత్వం, న్యూక్లియర్ ప్లాంట్ ఆపరేటర్ మధ్య విభజించబడుతుంది. ఆపరేటర్ బాధ్యత ప్లాంట్ పవర్ అవుట్‌పుట్ ఆధారంగా గ్రేడ్ చేయబడింది.చిన్న ప్లాంట్లు (150 ఎండబ్ల్యూఈ కంటే తక్కువ) ఆపరేటర్లకు ప్రమాదం ఎంత నష్టం కలిగించిన గరిష్ట బాధ్యత రూ.వంద కోట్లు మాత్రమే. అయితే, చిన్న న్యూక్లియర్ రియాక్టర్ నిర్మాణం, నిర్వహణ వ్యయం ఈ మొత్తాన్ని ఎన్నోరెట్లు మించిపోవచ్చు. ఆపరేటర్ గరిష్ట జరిమానా చెల్లించి భద్రత లోపాలను సరిచేయకుండా ఉండే అవకాశం ఉంది, ముఖ్యంగా శాంతి చట్టం లాభాపేక్షతో కూడిన ప్రయివేట్ ఆపరేటర్లకు తలుపులు తెరిచింది. శాంతి చట్టం అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్‌ను ప్రస్తుత రూపంలోనే కొనసాగిస్తుంది. అంతేకాకుండా, దాని సభ్యులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీ అధ్యక్షత వహించే అటామిక్ ఎనర్జీ కమిషన్ నియమిస్తుంది. అంటే, రెగ్యులేటర్‌ను నియమించేది దాని సౌకర్యాలను రెగ్యులేట్ చేయాల్సిన సంస్థే. శాంతి చట్టం 2012లో పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన విలువైన సూచనలను పట్టించుకోలేదు. దీనివల్ల ఎన్డీయే ప్రభుత్వం న్యూక్లియర్ రెగ్యులేటర్‌కు స్వతంత్రత ఇవ్వడానికి ఎటువంటి ఉద్దేశం లేదని మాట్లాడటం, న్యూక్లియర్ రియాక్టర్ల సమీపంలో నివసిస్తున్న ప్రజల భద్రతపై పూర్తి నిర్లక్ష్యం వహించడమే అవుతుంది. చట్టం సెక్షన్ 39(4) న్యూక్లియర్ సౌకర్యాలపై సమాచారం పొందే పౌరుల హక్కును రద్దుచేస్తుంది, న్యూక్లియర్ రంగాన్ని ప్రయివేట్, విదేశీ వ్యాపారస్తులకు అనుకూలతకు ఎక్కువ ఉపయోగపడుతుంది. నిబంధన అవకాశాలు, దుర్వినియోగానికి తావిస్తుంది. దేశ న్యూక్లియర్ ఫ్రేమ్‌వర్క్‌ను పూర్తిగా మార్చే ఈ ముఖ్యమైన చట్టం స్వల్ప పార్లమెంటరీ చర్చతో, పార్లమెంటరీ కమిటీ పంపకుండా ఆమోదించబడి నందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బిల్ టెక్స్ట్ 2025 డిసెంబర్ 15న అందుబాటులోకి వచ్చింది,

# అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం!

అసోం అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతోంది. తాజాగా అభ్యర్థుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీని ఛైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ ఏడాది ప్రథమార్ధంలో ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ప్రకటించారు. అందులో భాగంగా అసోం, బంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో కమిటీలో నలుగురు సభ్యులు చొప్పున ఉంటారని పేర్కొన్నారు. అందులో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అయిన ప్రియాంక గాంధీని అసోం కమిటీకి ఛైర్‌పర్సన్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.



### గెలుపే లక్ష్యంగా!

కాగా, ఈసారి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తుపెట్టుకొని అసోంలో బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే చాలా పకడ్బందీగా స్క్రీనింగ్ కమిటీలో ప్రియాంక గాంధీతోపాటు, ఆమె సన్నిహితులైన లోక్ సభ ఎంపీలైన ఇమ్రాన్ మసూద్, సప్తగిరి శంకర్ ఉలక, సిరివెళ్ల ప్రసాద్‌లను సభ్యులుగా నియమించింది. కేరళ స్క్రీనింగ్ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత మధుసూదన్ మిస్త్రీని ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో రాజ్యసభ ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి కమిటీలకు ఛత్తీస్‌గఢ్ మాజీ ఉపముఖ్యమంత్రి టీఎస్ సింగ్ డియో ఛైర్మన్‌గా ఉన్నారు. ఇందులో యశోమతి ఠాకూర్, జి.సి. చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నారు. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీకి బి.కె. హరిప్రసాద్ నేతృత్వం వహిస్తారు. ఆ కమిటీలో మహమ్మద్ జావేద్, మమతా దేవి, బి.పి.సింగ్‌లు సభ్యులుగా ఉన్నారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు/ఇన్‌ఛార్జ్‌లు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నాయకులు, ఏఐసీసీ కార్యదర్శులు పదవి రీత్యా తమ తమ రాష్ట్రాల స్క్రీనింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

### త్వరలోనే ఎన్నికలు?

కేరళ, బంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అసోం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్నాయి. అయితే 126 మంది సభ్యులున్న అసోం అసెంబ్లీకి ఈ ఏడాది మార్చి – ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

### చేతులు కలిపిన విపక్ష పార్టీలు

ప్రస్తుతం అసోంలో బీజేపీ అధికారంలో ఉంది. దాని నుంచి అధికారం చేజిక్కించుకోవడానికి, కాంగ్రెస్, సీపీఐ(ఎం), రైజోర్ దళ్, అసోం జాతీయ పరిషత్ (ఏజేపీ), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, జాతీయ దళ్–అసోం (జేడీఏ), కర్బీ ఆంగ్లాంగ్‌కు చెందిన ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ (ఏపీహెచ్ఎల్‌సీ) పార్టీలు చేతులు కలిపాయి. ఆ పార్టీలన్నీ కలిసి ఒకే వేదిక నుంచి అసోం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాయి.

అసోం అసెంబ్లీలో మొత్తం 126 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం బీజేపీకి 64 మంది సభ్యులు ఉండగా, దాని మిత్రపక్షాలపై ఏజీపీకి 9, యూపీపీఎల్‌కు 7, బీపీఎఫ్‌కు 3 సభ్యులు ఉన్నారు. ఇక, విపక్ష శిబిరంలో కాంగ్రెస్‌కు 26, ఏఐయూడీఎఫ్‌కు 15, సీపీఐ(ఎం)కు 1 ఎమ్మెల్యే ఉన్నారు. వీరితోపాటు ఒక స్వతంత్ర శాసన సభ్యుడు కూడా అసోం అసెంబ్లీలో ఉన్నాడు.

తమిళనాడులో ప్రస్తుతం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే అధికారంలో ఉంది. అక్కడ పాగా వేయడానికి ఓ పక్క బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తోంది. అయితే ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత అయిన విజయ్ మాత్రం, కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే కాంగ్రెస్‌కు అది చాలా ప్లస్ పాయింట్ అయ్యే అవకాశం ఉంది.

కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారంలో ఉంది. అయితే ఇటీవల జరిగిన లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో బీజేపీ కీలక స్థానాల్లో విజయం సాధించి, మంచి ఊపుమీద ఉంది. అందువల్ల కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఇప్పటి నుంచే రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం సన్నద్ధం అవుతోంది.

ప్రస్తుతం పుదుచ్చేరిలో ఎన్.రంగస్వామికి చెందిన ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీల సంకీర్ణ ప్రభుత్వం ఉంది. అయితే డీఎంకే, కాంగ్రెస్‌ల కూటమి ఇక్కడ చాలా బలమైన ప్రతిపక్షంగా ఉంది. అందుకే ఈసారి అధికారం చేజిక్కించుకోవాలని ముందు నుంచే వ్యూహాలు రచిస్తోంది.

బంగాల్‌లో ప్రస్తుతం మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. బీజేపీ ఇక్కడ చాలా బలంగా ప్రజల్లో దూసుకుపోతోంది. మరి కాంగ్రెస్ అక్కడ తన ప్రభావం చూపగలుగుతుందో, లేదో చూడాలి.

# వెనెజువెలాలో పరిస్థితులు ఆందోళనకరం

వెనెజువెలాలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ తెలిపింది. అమెరికా దాడులు, తదితర పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొంది. వెనెజువెలా ప్రజల శ్రేయస్సు, భద్రతకు భారత్ తన మద్దతు కొనసాగిస్తుందని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. 'వెనిజువెలాలో ఇటీవల జరిగిన పరిణామాలు తీవ్రమైన ఆందోళనకు కారణమవుతున్నాయి. పరిస్థితి ఎలా మారుతుందో మేం దగ్గరగా గమనిస్తున్నాం. వెనిజువెలా సంక్షోభంలో భాగమైన అన్ని పక్షాలు చర్చలు, దౌత్య మార్గాలను ఆశ్రయించాలి. వెనిజువెలా ప్రజల భద్రత, సంక్షేమానికి భారత్ మద్దతు ఇస్తోంది. ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొనేలా సమస్యలను సంభాషణల ద్వారా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అన్ని పక్షాలను కోరుతున్నాం' అని విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రవాస భారతీయులతో సంప్రదింపులు జరుపుతోందని విదేశాంగ శాఖ పేర్కొంది. సాధ్యమైన సహాయాన్ని అందించేందుకు రాయబార కార్యాలయం సిద్ధంగా ఉందని తెలిపింది.




### అనవసర ప్రయాణాలు వద్దు

భారతీయులకు విదేశాంగ శాఖ హెచ్చరిక జారీ చేసింది. వెనెజువెలాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, శనివారం కీలక సూచనలు జారీ చేసింది. వెనెజువెలాకు అనవసర ప్రయాణాలు పూర్తిగా నివారించాలని భారతీయ పౌరులను కోరింది. అలాగే ఇప్పటికే అక్కడ ఉన్న భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను తగ్గించాలని సూచించింది. కారాకాస్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులో ఉండాలి తెలిపింది

### మదురో వెంటనే విడుదల చేయాలి : చైనా

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను వెంటనే విడుదల చేయాలని అమెరికాను చైనా కోరింది. వెనెజువెలా ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రక్రియను ఆపాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని అమెరికాకు బీజింగ్ సూచించింది. అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలు, ప్రాథమిక నిబంధనలను, ఐరాస చార్టర్ సూత్రాల్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. లాటిన్ అమెరికా, కరేబియన్ లలో శాంతి, భద్రతలకు ముప్పు కలిగించే అమెరికా ఆధిపత్య ప్రవర్తనను చైనా గట్టిగా వ్యతిరేకిస్తుందని పేర్కొంది. అమెరికా నిర్ణయాన్ని ప్రమాదకర ఉదాహరణగా అభివర్ణించిన ఐరాస సోమవారం భద్రతా మండలి సమావేశం కావాలని కోరింది.

మదురోను బంధించిన అమెరికా ఇప్పటికే ఆయనను న్యూయార్క్‌ను తరలించింది. న్యూయార్క్ నగరంలోని డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేంద్రానికి (డీఈఏ) మదురోను తరలించారు. మదురో చేతులకు సంకెళ్లతో ఉన్న దృశ్యాలను అమెరికా విడుదల చేసింది. అందులో మదురోను ఇద్దరు అదికారులు డీఈఏ తరలిస్తున్నట్లుగా ఉంది. తర్వాత మదురోను న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్ (ఎండీసీ)కు తరలించనున్నట్లుగా తెలుస్తోంది.

మరోవైపు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌ను నియమిస్తున్నట్లు ఆ దేశ సుప్రీం కోర్టు ప్రకటించింది. ప్రభుత్వ పరిపాలనా కొనసాగింపు, దేశ రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు, వామపక్ష గెరిల్లా నాయకుడు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన డెల్సీ రోడ్రిగ్స్. ఆమె 1969లో వెనెజువెలా రాజధాని కారకాస్‌లో జన్మించారు. మదురో ప్రభుత్వంలో ఆమె కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 2018లో ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఉపాధ్యక్షురాలి స్థానంతో పాటు ఆర్థిక, చమురు మంత్రిత్వ శాఖల మంత్రిగా కొనసాగారు. వెనెజువెలాలోని చమురు కోసం ట్రంప్ సుంకాల విధించిన వేళ దేశాన్ని ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. మదురోకు విశ్వసనీయురాలిగా పేరు తెచ్చుకున్నారు.

# గుర్మీత్ రామ్ రహీమ్‌కు మళ్లీ పెరోల్- 6 ఏళ్లలో 15వ సారి బయటకి!

అత్యాచారం, హత్య వంటి తీవ్రమైన నేరాల్లో దోషిగా తేలి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి జైలు నుంచి బయటకు వచ్చారు. తాజాగా ఆయనకు మరో 40 రోజుల పెరోల్ మంజూరు చేసింది హరియాణా ప్రభుత్వం. గడిచిన ఆరేళ్లలో (2020 నుంచి) ఆయనకు జైలు నుంచి తాత్కాలిక ఊరట లభించడం ఇది 15వ సారి కావడం గమనార్హం. అయితే రామ్ రహీమ్‌కు జైలు గేట్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు తెరుచుకుంటున్నాయని సిక్కు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### 15వ సారి విడుదల, ఇదీ లెక్క

రోహ్‌తక్‌లోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్న రామ్ రహీమ్, తరచూ పెరోల్‌పై బయటకు వస్తున్నారు. ప్రస్తుతం 40 రోజుల పెరోల్ మంజూరైంది. గత ఏడాది ఆగస్టులో కూడా ఆయనకు 40 రోజుల పెరోల్ ఇచ్చారు. అంతకుముందు ఏప్రిల్‌లో 21 రోజుల బెయిల్‌పై బయటకు వచ్చారు. గత ఏడాది జనవరిలో 30 రోజుల పెరోల్ తీసుకున్నారు. ఇలా 2020 నుంచి ఇప్పటివరకు మొత్తం 15 సార్లు ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు.

### గతంలో ఎన్నికల టైమింగ్‌లోనే

ఇప్పుడు ఎన్నికలు లేనప్పటికీ, గతంలో ఆయన విడుదలైన సమయాలను పరిశీలిస్తే, అవి కచ్చితంగా ఎన్నికల కోసమేనన్న విమర్శలు ఉన్నాయి. గత ఏడాది (2025) ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలకు ముందు, జనవరిలో ఆయనకు 30 రోజుల పెరోల్ లభించింది. 2024 అక్టోబర్ 5న హరియాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దానికి సరిగ్గా నాలుగు రోజుల ముందు (అక్టోబర్ 1న) ఆయన 20 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చారు. 2022 ఫిబ్రవరిలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు కూడా ఆయనకు మూడు వారాల బెయిల్ లభించింది. ఇలా కీలకమైన ప్రతి ఎన్నికల సమయంలోనూ ఆయన బయట ఉంటూ ఓటు బ్యాంకును ప్రభావితం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

### నేర చరిత్ర ఇదీ

గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ నేపథ్యం నేరమయమైంది. ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నది సాధారణ కేసుల్లో కాదు. తన ఆశ్రమంలోని ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచారం చేసిన కేసులో 2017లో కోర్టు ఆయనకు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే 16 ఏళ్ల క్రితం ఒక జర్నలిస్టును హత్య చేసిన కేసులో కూడా 2019లో ఆయన దోషిగా తేలారు. డేరా చీఫ్‌తో పాటు మరో ముగ్గురికి ఈ హత్య కేసులో శిక్ష పడింది.

### యూపీ ఆశ్రమంలోనే మకాం

జైలు నుంచి బయటకు వచ్చిన ప్రతిసారీ ఆయన తన ప్రధాన కేంద్రమైన హరియాణలోని సిర్సాకు వెళ్లడం మానేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌శ్రీపత్ జిల్లాలో ఉన్న డేరాకు చెందిన 'బర్నావా ఆశ్రమం'లో గడుపుతారు. గతంలో బయటకు వచ్చిన 13 సందర్భాల్లో ఆయన ఎక్కువ రోజులు అక్కడే ఉన్నారు. హరియాణ, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో డేరాకు భారీ సంఖ్యలో అనుచరులు ఉన్నారు. సిర్సా, ఫతేహాబాద్, కురుక్షేత్ర, కైథాల్, హిసార్ జిల్లాల్లో ఆయన ప్రభావం ఎక్కువ.

### చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు

హరియాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ వంటి సిక్కు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తీవ్రమైన నేరాలు చేసిన వ్యక్తికి ఇన్ని సార్లు పెరోల్ ఇవ్వడం చట్టాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడుతున్నాయి. ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే దోషులను కాపాడుతోందని విమర్శిస్తున్నాయి.

## 'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం



'ఒలింపిక్స్-2036 క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని ప్రధాని గుర్తుచేశారు. అండర్-17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ క్రీడతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామని చెప్పారు. కాగా జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యి మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు చెబుతున్నారు.

## మోదీజీ.. ట్రంప్ చేసినప్పుడు మీరెందుకు చేయలేరు.. వెనెజువెలా ఘటనపై ఒవైసీ రియాక్షన్!



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన ఘటనపై ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వెనెజువెలాలో సైనిక చర్యలు చేపట్టి అక్కడి అధ్యక్షుడినే బంధించినప్పుడు.. మీరు పాకిస్థాన్‌కు వెళ్లి 26/11 ఉగ్రదాడికి పాల్పడిన మాస్టర్‌మైండ్స్‌ను పట్టుకురావచ్చు కదా అని ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ట్రంప్ చేసినప్పుడు మీరెందుకు చేయలేరని ప్రశ్నించారు. మోదీజీ.. ముంబై దాడులకు కుట్రలు పన్నిన క్రూరులు.. అది మసూద్ అజర్ అయినా సరే.. లష్కరే తోయిబా ఉగ్రవాదులైనా సరే పాకిస్థాన్ నుంచి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక నియంత్రణతో కూడిన విధానాన్ని అనుసరిస్తుందని బీజేపీ ఎంపీ గులాం అలీ ఖటానా తెలిపారు. ప్రధాని మోదీ పాలనలో ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకుంటాం తప్ప.. దేశాలను కాదని స్పష్టం చేశారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని.. మనం పొరుగు దేశాలు చిన్నవైనా, పెద్దవైనా వాటితో స్నేహపూర్వకంగానే ఉండటం మన బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రభావితం కావడం లేదని చెప్పారు. బిహార్ మంత్రి దిలీప్ జైస్వాల్ కూడా ఒవైసీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒవైసీ ఎప్పుడూ హెడ్‌లైన్లలో రావాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇప్పుడు ఒవైసీ ట్రంప్‌నకు కూడా సలహాలు ఇస్తున్నారని.. ఆయన సలహాలను ట్రంప్ కూడా పరిగణనలోకి తీసుకుంటాడేమో అని సెటైర్లు వేశారు.

## రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం.. 200కు పైగా వాహనాలు దగ్ధం



**తిరువనంతపురం:** రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పార్కింగ్ స్థలంలో ఉన్న 200కు పైగా ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. మంటలు, దట్టమైన పొగలు చూసి రైల్వే అధికారులు, ప్రయాణికులు, సమీపంలోని నివాసితులు భయాందోళన చెందారు. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. కేరళలోని త్రిస్సూర్ రైల్వే స్టేషన్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో ప్లాట్‌ఫామ్ నంబర్ 2 సమీపంలోని ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ ఉండటంతో మంటలు మరింతగా ఎగసిపడ్డాయి. దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో రైలు ప్రయాణికులు, అధికారులు, సమీపంలోని నివాసితులు ఈ మంటలు చూసి భయాందోళన చెందారు. కాగా, అగ్నిప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అర గంట పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న సుమారు 200కు పైగా ద్విచక్ర వాహనాలు కాలిపోయినట్లు గుర్తించారు. మరోవైపు ఈ అగ్ని ప్రమాదానికి కారణంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఈ సంఘటన వల్ల రైలు సేవలు ప్రభావితం కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. కాగా, రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదం వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఫిబ్రవరిలో పురపోరు

**హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల దిశలో అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఈ నెలలోనే ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని, ఫిబ్రవరిలో ఈ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్రాంతికి ముందు లేదంటే ఆ తర్వా త కచ్చితంగా షెడ్యూల్ ప్రకటించి ఆ వెనువెంటనే నోటిఫికేషన్ ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ నెల 11న లేదంటే 20న షెడ్యూల్ ప్రకటించే అవకాశా లున్నాయి. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలోగా ఎన్నికల తతంగాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది.

**డబ్ల్యూఈఎఫ్ సమావేశాలకు సీఎం..**

జనవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలు ఈనెల 19 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు 17 లేదా 18న సీఎం రేవంత్ బయలుదేరతారని తెలుస్తోంది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో జరిగే సమావేశాల తర్వాత ఆయన అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనను కూడా ముగించుకుని ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు వస్తారని, 3న జడ్చర్లకు వెళ్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. ఫిబ్రవరి 3న జడ్చర్లలో ఆయన ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత పలు జిల్లాల్లో పర్యటిస్తారు. గత రెండేళ్లలో ఆయన ఎక్కడెక్కడ పర్యటించారన్న దానిపై సీఎంవో వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ దఫా జిల్లాల పర్యటనలో గతంలో వెళ్లని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని, ఈ మేర కు షెడ్యూల్ తయారవుతోందని సమాచారం.

**స్థానిక ఎన్నికలు పూర్తి చేస్తేనే..**

15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు రావాలంటే.. స్థానిక సంస్థలకు ఎన్నికలు పూర్తి చేయాలి. అప్పుడే కేంద్రం గ్రాంట్లు విడుదల చేసేందుకు సాధ్యమవుతుంది. దాదాపు రూ.500 కోట్ల ని ధులు రాకుండా ఆగిపోయిన నేపథ్యంలో మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జీహెచ్‌ఎంసీ పాలక మండలి గడువు ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత ఈ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించనున్నట్లు తెలిసింది. అనంతరం 300 వార్డులను ఈ మూడు కార్పొరేషన్లకు సర్దుబాటు చేసిన అనంతరం ఓటర్ల జాబితాను ప్రకటించి...ఎన్నికలు వచ్చే మే లేదా జూన్‌లో నిర్వహించే అవ కాశం ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

**ఆందోళన కలిగిస్తున్న బోగస్ ఓటర్లు**

రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎన్నికలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ త్వరలోనే పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను రిలీజ్ చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా నగర, పురపాలికల ఎన్నికల్లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేసి విడుదల చేశారు. ఈ నెల 10న తుది జాబితా ప్రకటించనున్నారు. కరీంనగర్ నగరపాలక పరిధిలో 3,40,775 మంది ఓటర్లు ఉన్నారు. అభ్యంతరాలను పరిశీలించేందుకు, డివిజన్ల పరిధిలో మార్పులు, చేర్పులు చేసేందుకు చర్యలు చేపట్టే వీలు ఉంది. ఇప్పటికే బోగస్ ఓటర్లు ఉన్నట్లు, ఇతర ప్రాంతాల ఓటర్లు ఉండటంతో ఆశావహులు, మాజీ పాలకవర్గ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త ఓటర్ల నమోదు**

పురపాలికల ఎన్నికలు వచ్చే నెల రెండో వారంలో ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో ప్రస్తుత ఓటర్ల జాబితాలో లేని వారిని గుర్తించి కొత్తగా ఓటర్లను నమోదు చేసేందుకు ఆశావహులు కసరత్తు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్న వారిని పట్టణాల్లోకి మార్చే పనిలో వారంతా నిమగ్నమయ్యారు. ఆధార్‌కార్డులు, వివరాలు సేకరించి మీసేవ కార్యాలయాలు, ఆన్‌లైన్ సెంటర్లలో నమోదు చేసుకుంటున్నారు. అయితే ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వాల్సి ఉంది. దీనికి అదనంగా ఓటరు జాబితా వస్తోంది. దాని ఆధారంగానే ఓటు వేసేందుకు వీలు ఉండనుంది.

గ్రామీణ ప్రాంతాల్లో, సొంతూరులో ఉన్న వారికి సంబంధించి పట్టణాల్లోనూ రెండు చోట్ల ఓటరుగా ఉన్నారు. ఉద్యోగాలరీత్యా, పిల్లల చదువులు, వ్యాపారాలు చేసుకునే వారికి సొంతంగా ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వీరంతా పంచాయతీ ఎన్నికల్లో అక్కడ ఓటు వేస్తున్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడా ఓటు వేయనున్నారు.

**ఉదాహరణలు :**

కరీంనగర్‌లోని ఒక ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా ఉంటున్న ఆంజనేయులు ఇటీవల తిమ్మాపూర్ మండలంలోని ఒక గ్రామంలో తనతోపాటు కుటుంబ సభ్యులతో కలిసి పంచాయతీ ఎన్నికల్లో ఓటువేసి తిరిగి వచ్చారు. అది సొంతూరు కావడంతో అక్కడ ఓటు హక్కు ఉంది.

పట్టణాల్లో పుర, నగరపాలిక ఎన్నికలు వస్తుండటంతో పల్లెలో ఓటు హక్కు ఉన్న వారందరి వివరాలు సేకరించి ఓటు మార్చుకునేందుకు ఇక్కడి ఆశావహులు ప్రయత్నాలను ప్రారంభించారు. ఇలాంటి వారందరినీ కొత్తగా ఓటర్ల జాబితాలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారు.

**త్వరలోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ సిద్ధమైన విషయం తెలిసిందే. ఈనెల 11 లేదా 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. గడువు ముగిసిన 117 మున్సిపాలిటీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఎన్నికల సంఘం జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఈనెల 10న తుది జాబితా వెలువరిస్తుంది. దీంతో ఈనెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేందుకు అవకాశం ఉంది. ఒకవేళ సంక్రాంతి పండగ, సెలవుల కారణంగా కుదరకపోతే 20న విడుదల చేస్తారు. ఇందుకు అనుగుణంగా, మిగతా ప్రక్రియ సజావుగా సాగేలా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఇప్పటికే సిద్ధమైంది. రాష్ట్రంలో ఇప్పటికే 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు జనవరితోనే పాలన గడువు ముగిసిపోయింది. అప్పటి నుంచి అవి ప్రత్యేక అధికారుల పాలనలోనే నడుస్తున్నాయి. ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లు, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 2 మున్సిపాలిటీల పాలక వర్గాలకు ఏప్రిల్ వరకు గడువు ఉండటంతో మినహాయింపు ఇవ్వవచ్చనేది సమాచారం. జీహెచ్‌ఎంసీకి వచ్చే ఫిబ్రవరి, మిగిలిన వాటికి మే నెల వరకు గడువు అనేది ఉంది.

# పోలీసులకు ఐ బొమ్మ రవి చుక్కలు

**హైదరాబాద్ :** తప్పు చేసి అడ్డంగా దొరికినా.. బొంకి బయటకు రావొచ్చనే ప్లాన్ వేశాడో, లేక ఆధారాలు లేకుండా వీళ్లేం చేస్తారని ఫిక్స్ అయ్యాడో.. మొత్తానికి ఐబొమ్మ రవి తాజాగా మాట్లాడుతున్న తీరు, బాడీ లాంగ్వేజ్ చూస్తున్న వాళ్లంతా షాక్ అవుతున్నారు. తప్పు చేసి పశ్చాత్తాపం కనిపిస్తుందని అంతా అనుకుంటే , తప్పే చేయకుండా మీ ఓవర్ యాక్షన్ ఏంటన్నట్లుగా మీడియా ప్రశ్నలకు రివర్స్‌లో సమాధానాలిస్తున్నాడు ఐబొమ్మ కేసులో పోలీసు విచారణ ఎదుర్కొంటున్న నిందితుడు రవి.విచారణలో భాగంగా పోలీసులు ఏ ప్రశ్నలు అడిగినా తడుముకోకుండా సమాధానం చెబుతున్న ఐబొమ్మ రవి, అడిగిన ప్రశ్నలు మళ్లీ అడిగితే మాత్రం కళ్లు ఉరిమి చూస్తున్నాడట. పైరసీ గుట్టు బయటపడ్డాక , సినీ ప్రముఖులను సైతం ఈ కేసులో ఇరికించడానికి విశ్వప్రయత్నాలు చేసినట్లుగా తెలుస్తోంది. సైబర్ క్రైమ్ డిసీపి ఆధ్వర్యంలో 12రోజులపాటు నిందితుడు రవిని విచారించిన పోలీసులు , రవి ఇచ్చే సమాధానాలకు షాకవ్వాల్సి వస్తోందట. మాటలు మార్చి మార్చి మాట్లాడుతూ, చివరకు పరిచయం ఉన్న స్నేహితులు, బంధువులను సైతం మీరెవరు , ఇప్పుడే చూస్తున్నా అంటూ వింత సమాధానాలతో నట విశ్వరూపం చూపిస్తున్నాడట.ఐబొమ్మ వెబ్ సైట్ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించిన రవి, వెబ్ సైట్స్ పోటీ విపరీతంగా పెరగడంతో , వాటి నుండి తట్టుకునేందుకు పట్టుకోండి చూద్దామంటూ ఫేక్ పోస్టర్ ను క్రియేట్ చేసి, పోలీసులకు సవాలు విరిసినట్లుగా తెలుస్తోంది. సినీ రంగానికి



చెందిన కొందరు ప్రముఖులు, బయటి వ్యక్తులతో కలిసి ఇదంతా చేస్తున్నారని నమ్మించే ప్రయత్నం చేసినట్లుగా విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. వీ ఆర్ ఇన్ఫో టెక్ పేరుతో ఐబొమ్మ, బప్పం టీవీలను వెబ్ సైట్ లను రిజిస్టర్ చేసినట్లు గుర్తించిన పోలీసులు ,ఇప్పటికే ఆయా కంపెనీలకు మెయిల్ పంపి అదనపు సమాచారం సేకరిస్తున్నారు. తాను పైరసీ సినిమాలు వెబ్ సైట్ లో పెట్టలేదని, కేవలం ఆయా డొమైన్లకు సర్వీసు మాత్రమే ఇచ్చానంటూ తాజాగా కొత్త రాగం అందుకున్నాడుఐబొమ్మ రవి విచారణలో వ్యవహరిస్తున్న తీరుతో పోలీసులు సైతం ఆశ్చర్యపోతున్నాడు. తనతో కలిసి రూమ్ లో ఉన్న స్నేహితులను సైతం గుర్తించడంలో వీర లెవిల్ లో నటిస్తున్నాడు. రవి స్నేహితులైన అంజయ్య, ప్రహ్లాద్, కాళీ ప్రసాద్ కు మాయమాటలు చెప్పి ,వారి వద్ద ఆధార్ ,పాన్ కార్డులను తీసుకుని ,వాటిని మార్చి నకిలీ పత్రాలు సంపాదించడం, ఫోర్జరీ సంతకాలు చేయడం చేసేవాడు. ఇలా తన పేరు క్రైమ్ సీన్ లో లేకుండా చేసేందుకు అవసరమైన అన్ని అడ్డదారులు తొక్కాడు. ప్రాణ స్నేహితుడైన ప్రహ్లాద్ ను పోలీసులు చూపిస్తే , ఇదే మొదటి సారి చూస్తున్నా, అతనెవరో నాకు తెలియదంటూ బుకాయిస్తున్నాడు. అంతేకాదు ఏకంగా పోలీసులకు సైతం తాను నేరం చేశాననే రుజువుందా, నడిపింది ఐబొమ్మ అనే ఆధారాలు ఉంటే చూపండి అంటూ అడ్డదిడ్డంగా వాదిస్తున్నాడట.

# తెలంగాణలో తగ్గిన రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవడానికి మార్కెట్ విలువల పెంపును నిలిపివేసినా, ఆ రంగం ఇంకా గడ్డు పరిస్థితుల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య సుమారు 50,000 తగ్గింది. గత ఏడాది 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా... ఈసారి 12.50 లక్షలకే పరిమితమయ్యాయి. అయితే... రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయం రూ. 11,100 కోట్లకు పెరగడం విశేషం. హోమ్ లోన్ల కోసం రైతులు ఆస్తి విలువను ఎక్కువగా చూపడమే దీనికి కారణం. అయినప్పటికీ, ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ప్రస్తుతం అధికారులకు పెద్ద సవాలుగా మారింది.తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని తిరిగి బలోపేతం చేసేందుకు మార్కెట్ విలువల సవరణను తాత్కాలికంగా నిలిపివేయడం.. బిల్డర్లలో మనోధైర్యాన్ని నింపేలా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం వంటి అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సంక్షోభం నుండి పూర్తిగా బయటపడలేదని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఆందోళనకరంగా తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే



ఈ ఏడాది సుమారు 50,000 రిజిస్ట్రేషన్స్ తక్కువగా నమోదయ్యాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా.. ఈసారి ఆ సంఖ్య 12.50 లక్షలకు పడిపోయింది. ఇందులో నివాస, వాణిజ్య ప్రాంతాల రిజిస్ట్రేషన్లతో పాటు వివాహ నమోదులు, మ్యుటేషన్లు కూడా ఉన్నాయి.రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి రూ. 10,500 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 11,100 కోట్లు సమకూరాయి. అయితే.. ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల భారీ ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ఇప్పుడు క్లిష్టంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మొత్తం రూ. 14,230 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన మూడు నెలల్లో సుమారు రూ. 7,800 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది.. ఇది దాదాపు అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, సెప్టెంబర్ , నవంబర్ నెలల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లు ఆశాజనకంగా సాగాయి. మిగిలిన నెలల్లో వృద్ధి మందగించిందని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా డిసెంబర్ నెలను 'పేలవమైన పనితీరు' ఉన్న నెలగా అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో 1.15 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈ ఏడాది కేవలం 1 లక్ష మాత్రమే నమోదయ్యాయి. దీనికి భిన్నంగా జూలై 2024లో 2 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. జూలై 2025లో అవి 1.65 లక్షలకు తగ్గిపోయాయి.అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. ప్రస్తుతం కొనుగోలుదారులు ఎక్కువగా బ్యాంకు రుణాల పై ఆధారపడుతున్నారు. ఎక్కువ లోన్ పొందడం కోసం ఆస్తి విలువను ఎక్కువగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మరో కారణం ఏంటంటే.. హైదరాబాద్ , దాని చుట్టుపక్కల జిల్లాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్ల.. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ విలువకే రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో గత ఏడాది కంటే 20 శాతం అదనపు ఆదాయం వచ్చినా అది పెద్ద విజయమేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## నల్లమల సాగర్‌పై సుప్రీంకోర్టులో 5న విచారణ.. సీఎం రేవంత్ కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని అభ్యంతరం తెలిపింది. ఈ అంశాల్లో కేంద్ర జలసంఘం, కేంద్ర జలశక్తిశాఖ, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ డీపీఆర్ తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది. ఏపీ తలపెడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో ప్రస్తావించింది.

## రేవంత్‌ది కట్టుకథ.. కుట్రతో ప్రాజెక్ట్‌ల నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌కు లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. కుట్రపూరితంగా ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద సీఎం రేవంత్ కక్ష గట్టారు.. పాలమూరుపై పగబట్టారు. కాంగ్రెస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటోంది. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణకు ద్రోహం చేస్తోంది. కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. 2004-14 వరకు కాంగ్రెస్ పాలనలో 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 48.74 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చింది. పాలమూరు ఎత్తిపోతలు, డిండి ప్రాజెక్ట్‌లను కొనసాగిస్తామని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు.

**చంద్రబాబు ముఖం మీదే కేసీఆర్ చెప్పారు..**

టెలిమెట్రీ పెట్టాలని కేసీఆర్ ఎప్పుడో ఒప్పించారు. 2016లోనే టెలిమెట్రీ ఏర్పాటు చేశారు. సొంత ప్రాంతానికే రేవంత్ అన్యాయం చేస్తున్నారు. శాసన సభను రేవంత్ తప్పుదోవ పట్టించారు. తనకు అనుకూలంగా ఉన్న పేజీలను చదివారు. సభలో అసలైన పేజీలను రేవంత్ చదవకుండా వదిలేశారు. ఫస్ట్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోనే ట్రిబ్యునల్ ఏర్పాటుపై ప్రశ్నించాం. రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే నీటి హక్కులపై కేంద్రాన్ని నిలదీశాం. కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్రమే ముఖ్యం. పోతిరెడ్డిపాడు అక్రమ ప్రాజెక్ట్ అని ఆనాడే కేసీఆర్ చెప్పారు. చంద్రబాబు ముఖం మీదే బల్లగుద్దినట్టు కేసీఆర్ మాట్లాడారు. ఉత్తమ్ కట్టుకథలు, రేవంత్ పిట్ట కథలు చెప్పారు. తెలంగాణకు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్. రేవంత్ రెండేళ్లలోనే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పచెబుదామంటారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు రేవంత్, చంద్రబాబు లోపాయికారి ఒప్పందం కుదిరింది అని విమర్శించారు.

**60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ వల్లే నీటి సమస్యలు..**

అసెంబ్లీలో అబద్ధాలు ఆడినందుకు రాజీనామా చేయాలి. కాంగ్రెస్ మాత్రం ఒక్క ప్రాజెక్ట్ డీపీఆర్ కూడా కేంద్రానికి పంపించలేదు. మీ పాలనలో మూడు డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయి. అరెంజ్‌మెంట్, అగ్రిమెంట్‌కు తేడా తెలియకుండా విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కేంద్రానికి 11 ప్రాజెక్ట్‌ల డీపీఆర్‌లను పంపించాం. ఏడు ప్రాజెక్ట్‌లకు అనుమతి తీసుకొచ్చాం. తెలంగాణకు కేసీఆర్ అన్యాయం చేశారంటే ఎవరైనా నమ్ముతారా?. రేవంత్ అబద్దాలను చేసి నిజమే ఉరేసుకుంటుందేమో. బీఆర్ఎస్ హయంలోనే అత్యధికంగా కృష్ణా నీళ్ల వినియోగం జరిగింది. ప్రాజెక్ట్‌ల నిర్మాణాన్ని కేసీఆర్ పరుగులు పెట్టించారు. తెలంగాణకు బీఆర్ఎస్ మరణశాసనం రాసిందని చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. గత పదేళ్లు నీటి హక్కుల కోసం కేంద్రంపై కేసీఆర్ పోరాడారు. 2023లోనే 66:34 లేకుండానే అగ్రిమెంట్ చేశాం. కృష్ణా జలాల్లో 50:50 నీటి వాటాల కోసం కేంద్రానికి 28 లేఖలు రాశాం. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ వల్లే నీటి సమస్యలు వచ్చాయి అని చెప్పుకొచ్చారు.

**రేవంత్‌వి బలుపు మాటలు: కేటీఆర్**

అంతకముందు కేటీఆర్ మాట్లాడుతూ..'నదీ జలాల మీద కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రోహానికి పాల్పడుతోంది. అధికార మదంతో విర్రవీగుతూ, బలుపు మాటలతో రేవంత్ రెడ్డి విర్రవీగుతున్నాడు. ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని ఉరితీయాలి. రేవంత్‌కి ఒక్క భాషలో తిట్లు వస్తే మాకు నాలుగైదు భాషల్లో తిట్టడానికి వచ్చు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప తెలంగాణకు ఏం కావాలో.. రేవంత్‌కు తెలియదు. రేవంత్ మాటలతో కేసీఆర్ స్థాయి తగ్గదు. కేసీఆర్ గురించి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్ పార్టీని ఊరి వేయాలి?. అసలు ఈ ముఖ్యమంత్రి గారికి బేసిన్లు తెలియదు.. బేసిన్ అంతకంటే తెలియదు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉంది అని అడిగే రేవంత్ రెడ్డి ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాడు అంటూ సెటైర్లు వేశారు.

## 'అసెంబ్లీలో బీఆర్ఎస్ బాయ్‌కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా?'

-మొదటిపేజీ తరువాయి

కవిత మాట్లాడారు.

'అసెంబ్లీలో బీఆర్ఎస్ బాయ్‌కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా?' పాలమూరు-రంగారెడ్డి, నారాయణ్‌పేట్-కొడంగల్‌కు 77.5 టీఎంసీలు కేటాయిస్తే, 40 టీఎంసీలకే ఎందుకు అంగీకరించారని కవిత ప్రశ్నించారు. పాలమూరు ప్రజలకు రేవంత్‌రెడ్డి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. హరీశ్‌రావును తిడితే సభను వాయిదా వేసుకొని వెళ్లిపోవటం బీఆర్ఎస్ డ్రామా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ బాయ్ కాట్ హరీశ్‌రావు నిర్ణయమా? బీఆర్ఎస్ పెద్దల నిర్ణయమా అని గట్టిగా ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ నిర్ణయమైతే చరిత్రలో క్షమించరాని తప్పు చేసినట్లేనని చెప్పారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వదిలి బయట సభలు పెట్టి ప్రజలకు ఏమి వివరిస్తారని విమర్శించారు. తెలంగాణకు 3 శాతం నీళ్ల వాటా తగ్గించే ఒప్పందంపై హరీశ్ రావు సంతకం చేశారా? లేదా అని అడిగారు.

**కేసీఆర్‌ను అవమానిస్తే నేను రియాక్ట్ అయ్యా, మీరేందుకు కాలేదు**

అలాగే జూరాల నుంచి శ్రీశైలంకు ఇన్ టేక్ పాయింట్‌ను ఎందుకు మార్చారో సమాధానం చెప్పాలని కల్వకుంట్ల కవిత కోరారు. కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చితే నేనే రియాక్ట్ అయ్యాను, బీఆర్ఎస్ నుంచి ఎవరూ ఎందుకు స్పందించలేదన్నారు. సూర్యా పేటలో జగదీశ్‌రెడ్డి అనుచరులు ఆలయాలను, చెరువులను కూడా వదలలేదని ఆరోపించారు. అడ్డగోలుగా అవినీతి చేసిన వారిపై నేను మాట్లాడుతూనే ఉంటానని హెచ్చరించారు.

**"వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక్క మాట అన్నందుకు అసెంబ్లీని బాయ్‌కాట్ చేస్తారా?**

ఆ అంశంపై వాకౌట్ చేస్తే తరువాత సభకు రావచ్చు కదా మిగతా బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా? సభ నుంచి వాకౌట్ చేయాలనే నిర్ణయం హరీశ్ రావుదేనా? బీఆర్ఎస్ పార్టీలో హరీశ్ ఓ గుంపును తయారు చేస్తున్నారు. బాయ్‌కాట్ నిర్ణయం అధిష్ఠానానిదే అయితే అది మంచిది కాదు. బయట సభలు పెడుతూ చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదు. కృష్ణా పంపకాల్లో హక్కులు తగ్గించి హరీశ్ సంతకం ఎందుకు పెట్టారో చెప్పి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేయాల్సింది. హరీశ్ ధన దాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి మార్పు చేశారు. హరీశ్ నిర్ణయాలతో సాగు నీటి ప్రాజెక్టులకు తీవ్రం నష్టం జరిగింది." - కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

**ఆల్మట్టి ఎత్తు తగ్గించాలి**

'కేసీఆర్ తప్పులు చేశారనే వాదన తప్ప కృష్ణానది నీటి వాటాపై చర్చ లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచుకుంటే ఉత్తరం రాసి వదిలేశారు. కృష్ణాపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు సమగ్ర చర్చ జరపడం లేదు. తుంగభద్ర, కృష్ణా నీటిపై కర్ణాటకతో పేచీ ఉంటే రెండు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించడం లేదు? గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర ప్రాజెక్టు జాతీయ హోదాను తొలగించాలని, ఆల్మట్టి ఎత్తు తగ్గించాలని తీర్మానం చేయాలి.' అని కవిత వ్యాఖ్యానించారు. ఇప్పటికే కవిత బీఆర్ఎస్ మనుగడ కొనసాగాలంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలని అన్నారని తెలిసిందే. నదీ జలాల అంశాన్ని పిల్లకాకుల మీద వదిలేయవద్దని చెప్పారు. బీఆర్ఎస్ బబుల్ షూటర్లకే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదులు ఇచ్చారని విమర్శించిన సంగతి విదితమే.

# వాయు కాలుష్యంతో పుట్టబోయే బిడ్డ మెదడుపై కూడా ప్రభావం




వాయు కాలుష్యం కేవలం పెద్దలకే కాదు, గర్భంలో ఉన్న శిశువుల మెదడుపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గర్భిణులు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, బ్లాక్ కార్బన్ వంటి కణాలు బిడ్డ మెదడు ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయి. ఐక్యూ తగ్గడం, ఆటిజం వంటి న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కరోనా తర్వాత భారతదేశానికి ఎదురవుతున్న అతిపెద్ద ప్రమాదం వాయు కాలుష్యం అని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల సమస్యలే కాకుండా కళ్లు, గుండెతోపాటు మొత్తం శరీరానికి పెను ప్రమాదంగా మారుతుందని పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రంగా వాయు కాలుష్యం మన భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుందని పరిశోధకులు అంటున్నారు. ఢిల్లీ ఆస్పత్రిలో 20 నుంచి 30% వరకు ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేషెంట్లే ఎక్కువగా ఉన్నారని లెక్కలు చెబుతుండటం.. దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. అయితే.. ఈ వాయు కాలుష్యం వల్ల భూమిపైన జీవిస్తున్న మనకే కాకుండా.. భూమిపై అడుగు పెట్టబోయే పుట్టబోయే బిడ్డ మెదడును కూడా దెబ్బతీస్తుందని తాజా రిపోర్టస్ చెబుతున్నాయి. గర్భంతో ఉన్న మహిళలు వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టీకులేట్ మేటర్ బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు గర్భంలో ఉన్న శిశువు మెదడుకు ప్రమాదంగా మారాయి. గర్భధారణ సమయంలో హెయిర్ పొల్యూషన్ బారిన మహిళలు పడడం వల్ల అభివృద్ధి చెందుతున్న శిశువు మెదడు ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని లాండ్ సెట్ ప్లానిటరీ హెల్త్ జర్నల్ లో పబ్లిష్ అయిన ఒక అధ్యయనం పేర్కొంది. రెండు లేదా మూడు నెలల ప్రెగ్నెన్సీ సమయంలో ఈ ప్రభావం అధికంగా ఉండవచ్చని తెలిపింది. బార్సిలోనా లైఫ్ స్టడీ కోహట్ ఆధారంగా 754 గర్భిణీలపై వాయు కాలుష్య ప్రభావాలను పరిశోధకులు స్టడీ చేయగా స్పెషలైజ్డ్ అల్ట్రాసౌండ్ ద్వారా ఫీటల్ బ్రెయిన్ స్ట్రక్చర్లను విశ్లేషించారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టీక్యూలేట్ మ్యాటర్, బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు శిశువు మెదడుపై ప్రభావం చూపుతాయని వైద్యులు అంటున్నారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యం ప్రభావానికి గురైతే బిడ్డ మెదడు అభివృద్ధిపై ప్రభావంతో పాటు పుట్టిన తర్వాత ఐక్యూ లెవెల్ తగ్గే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. దీంతోపాటు ఆటిజం వంటి న్యూరో డెవలప్మెంటల్ సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు డాక్టర్ జి.లతా ఎంబిబిఎస్, ఎండి.. వాయు కాలుష్యం వల్ల గర్భిణీ స్త్రీ ముందస్తు ప్రసవం అయ్యే ప్రమాదంతో పాటు ఆ సమయంలో పుట్టిన బిడ్డ మెదడు పూర్తిగా అభివృద్ధి కాకపోవడం.. అలాగే.. పలు అనారోగ్య సమస్యలు పెంచే అవకాశం ఉందని అంటున్నారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాన్ని పూర్తిగా అవాయిడ్ చేస్తే.. కొంత బెటర్ అని వైద్యులు సూచిస్తున్నారు.

## ఆత్మహత్యలకు డిప్రెషన్ మాత్రమే కారణం కాదా?



ఆత్మహత్య అనగానే సాధారణంగా అందరూ అది మానసిక ఒత్తిడి లేదా డిప్రెషన్ వల్ల జరిగిందని భావిస్తారు. లేదంటే సమాజం, కుటుంబ పరిస్థితులు అనేక కారణాలు ఉన్నాయని అనుకుంటారు. అయితే, సూసైడ్ చేసుకోవాలనే ఆలోచనల వెనుక ఉన్న షాకింగ్ నిజాన్ని తాజా పరిశోధనలు బయటపెట్టాయి. సాధారణంగా ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే, వారు తీవ్రమైన మనస్తాపంలో ఉన్నారని లేదా డిప్రెషన్‌తో బాధపడుతున్నారని మనం అందరూ అనుకుంటాం. "అంత కష్టం ఏం వచ్చిందో" పాపం అని బాధపడతాం. కానీ, యూనివర్సిటీ ఆఫ్ ఉతా హెల్త్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన కేవలం మానసిక జబ్బుల వల్లే రాదని, దీనికి జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చని తేలింది. చాలా సందర్భాల్లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తులకు ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నట్లు రికార్డుల్లో ఉండదు. వారు అంతకుముందు ఎప్పుడూ డిప్రెషన్‌కు గురైనట్లు లేదా చికిత్స తీసుకున్నట్లు ఆధారాలు కనిపించవు. ఇలాంటి వారిపై పరిశోధకులు దృష్టిసారించారు. సుమారు 2,700 మందికి పైగా మరణించిన వ్యక్తుల జన్యువులను విశ్లేషించగా, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. మానసిక సమస్యలు ఉన్నవారిలో కనిపించే జన్యువుల కంటే, ఎలాంటి ముందస్తు లక్షణాలు లేకుండా ఆత్మహత్య చేసుకున్న వారిలో జన్యువులు భిన్నంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అంటే, ఆత్మహత్య చేసుకునే ప్రమాదం అనేది డిప్రెషన్, యాంగ్జైటీ లేదా పీటీఎస్‌డీ వంటి సమస్యలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా కూడా పని చేయవచ్చు. ఇప్పటివరకు ఆత్మహత్యలను నివారించడానికి కేవలం డిప్రెషన్ తగ్గించే మందులు లేదా కౌన్సెలింగ్‌పైనే వైద్యులు ఆధారపడుతున్నారు. అయితే, కొంతమందిలో జన్యుపరంగానే ఈ రిస్క్ ఉన్నప్పుడు, దాన్ని గుర్తించడానికి వేరే మార్గాలు వెతకాల్సి ఉంటుందని ఈ స్టడీ చెబుతోంది. ఈ జెనెటిక్ రిస్క్ ఫ్యాక్టర్లను ముందుగానే గుర్తిస్తే, భవిష్యత్తులో ప్రాణాలు కాపాడేందుకు కొత్త రకమైన చికిత్సలు మరియు పరీక్షలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆత్మహత్య అనేది కేవలం ఒక వ్యక్తి బలహీనత కాదు. దాని వెనుక అంతుచిక్కని సైన్స్ దాగి ఉంది. ఈ కొత్త ఆవిష్కరణలు మానసిక ఆరోగ్య రంగంలో సరికొత్త మార్పులకు దారితీయవచ్చు.

# జీవితంలో ఎదగాలనుకుంటున్నారా?



చేస్తున్న పనిలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అది అందుకు తగిన విషయాలపై దృష్టి సారిస్తేనే సాధ్యమవుతుంది. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికే ప్రయత్నిస్తుంటారు. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేసేది ఏదైనా అందులో ఎదగాలని తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటారు. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. రు చేసే పనిని మొదట ప్రేమించడం అలవర్చుకోండి. అందులో ప్రత్యేకతను చూపండి. తోపాటు చాలా మంది ఉన్నప్పటికీ ప్రత్యేకతను చాటుకోండి. ఇది మిమ్మల్ని అందరిలో ముఖ్యమైన వ్యక్తిగా నిలబెడుతుంది. విజయగాథల నుంచి నేర్చుకోవడం కంటే రంగంలో వైఫల్య కథలను కనుగొని చదవండి. ఎందుకంటే, వైఫల్య కథల నుంచి నిజమైన పాఠాలు నేర్చుకుంటారు. ఎందుకు విఫలమయ్యామో తెలుసుకుంటే.. రు ఆ పొరపాట్లు చేయకుండా విజయ తీరాలకు చేరుతారు.లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా సరైన కార్యాచరణ ప్రణాళికతో పనిచేయడం వల్ల రు లక్ష్యాన్ని మరింత సులభంగా సాధించవచ్చు. రు సాధించాలని కలలు కంటున్న దానిపైనే పూర్తి దృష్టి సారిస్తే రు విజయం సాధిస్తారు. కలల్లో తేలుతూ ఉండటం కంటే నిజమైన జీవితంలో ఉన్న సమస్యలను మనం గ్రహించి వాటిపై తగిన స్పందించాలి. రు చదివిన పుస్తకాల నుంచి, వ్యక్తిగత, వృత్తి జీవితంలో పొందిన అనుభవాల నుంచి కొత్త విషయాలను నేర్చుకోవాలి. సమస్యలు ప్రతిచోటా ఉంటాయి కాబట్టి.. ఒత్తిడికి గురికాకుండా అక్కడివారిని అర్థం చేసుకోవడం, వారితో సంభాషించడం ద్వారా పురోగతిని సాధించవచ్చు. ప్రణాళికలకు సంబంధించిన విషయాలను కొన్నింటిని రహస్యంగా ఉంచాలి. తద్వారా ఇతరుల నుంచి రు గౌరవం పొందుతారు. రు చేస్తున్న ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలి. సాధన చేయాలి. అనేక ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు తెలుసుకుంటూ ఇతరుల కంటే ఎక్కువ నేర్చుకుంటూ ఉండాలి. వ్యక్తిగత క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యం. ఇది మొత్తం అభివృద్ధిని నిర్ణయిస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నైతిక నియమాలను వదిలిపెట్టొద్దు. కు తెలిసిన వాటిని ఇతరులకు నేర్పించడం ద్వారా రు కూడా కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. రు చేపట్టిన ఏ పనినైనా 100శాతం కృషి చేస్తే పురోగతి సాధించడం సులభమవుతుంది. అదే సమయంలో తప్పు దిశలో వెళుతున్నామని తెలిస్తే వెనుకాడకుండా వెంటనే తిరిగి సరైన మార్గంలో వెళ్లడం ప్రారంభించాలి. ఇందుకు వెనకాడకూడదు. రంగంలోని గొప్పవారిని కలవడం, వారితో సమయం గడపడం ద్వారా వారి నుంచి రు స్ఫూర్తి పొందుతారు. ప్రతి ఉదయం డబ్బు, సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు ప్రణాళికలు వేసుకోవాలి. శారీరక, మానసిక ఆరోగ్యం అనేది మన ఎదుగుదలలో కీలకం కాబట్టి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. మనస్సుకు, శరీరానికి కాసేపు విశ్రాంతినిచ్చే అవకాశాన్ని పరిశీలించాలి. వీటన్నిటినీ క్రమం తప్పకుండా చేయడం వల్ల రు చేస్తున్న ఉద్యోగం లేదా వృత్తి, వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా పురోగతి సాధిస్తారనడంలో సందేహం లేదు.

# భారతీయులు ఆహారాన్ని వృధా చేస్తున్నారా?



ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఉన్నా, టన్నుల కొద్దీ ఆహారం వృధా అవుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటున ఒక వ్యక్తి ఏటా 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నాడు. ఈ వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయి. రీసైక్లింగ్, అవగాహనతో వృధాను అరికట్టడం, స్థిరమైన భవిష్యత్తుకు కీలకం. ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఒకవైపు వేధిస్తుంటే, మరోవైపు టన్నుల కొద్దీ ఆహారం చెత్తబుట్టల పాలవుతోంది. తాజాగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ నివేదికలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఒక వ్యక్తి సగటున ఏడాదికి 79 కిలోల ఆహారాన్ని వృధా చేస్తుండగా భారతీయులు కూడా ఈ విషయంలో తక్కువే కాదని నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలో సగటున ఒక వ్యక్తి ఏడాదికి 55 కిలోల ఆహార వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నాడు. ఇందులో మనం వండుకున్నాక మిగిలిపోయిన ఆహారం, కూరగాయల తొక్కలు, పాడైపోయిన పండ్లు వంటివి ఉన్నాయి. మన దేశ జనాభా దృష్ట్యా చూస్తే, ఇది పర్యావరణంపై ఎంతటి భారాన్ని మోపుతుందో అర్థం చేసుకోవచ్చు. అత్యధిక వ్యర్థాలు: మాల్దీవులు అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ఒక్కో వ్యక్తి ఏడాదికి ఏకంగా 207 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో ఈజిప్ట్ (163 కిలోలు), ఇరాక్ (143 కిలోలు), పాకిస్తాన్ (130 కిలోలు) ఉన్నాయి. అత్యల్ప వ్యర్థాలు: ఈ జాబితాలో రష్యా ఆదర్శంగా నిలుస్తోంది. రష్యాలో ఒక వ్యక్తి ఏడాదికి కేవలం 33 కిలోల వ్యర్థాలను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. కేవలం ఆహారమే కాదు ఇతర వ్యర్థాలను కూడా కలిపితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. భారత్‌లో ఒక వ్యక్తి రోజుకు సగటున 0.35 నుండి 0.6 కిలోల చెత్తను ఉత్పత్తి చేస్తున్నాడు. అంటే ఏడాదికి ఒక వ్యక్తి ద్వారా 125 కిలోల నుండి 200 కిలోల వరకు మొత్తం వ్యర్థాలు తయారవుతున్నాయి. దీనికి అదనంగా మారుతున్న టెక్నాలజీ వల్ల పాత సెల్ ఫోన్లు, వైర్లు వంటి ఈ-వ్యర్థాలు కూడా పెరిగిపోతున్నాయి. ఒక భారతీయుడు ఏడాదికి సగటున 2 కిలోల ఈ-వ్యర్థాలను సృష్టిస్తున్నాడు.

ధర్మఘంట

# ఈసారైనా ఇక్కడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు అయ్యేనా?

**ఖమ్మం :** ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఇబ్బందుల పాలుకావడం ఆ కాలనీవాసులకు సర్వసాధారణమైంది. ఎన్నికల ముందు నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు గురించి అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ అధికారుల ప్రయత్నాలు సఫలం కావడం లేదు. దీంతో అక్కడ కొద్దిమంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ డివిజన్‌లో ఇందిరమ్మ కాలనీతో పాటు సత్యనారాయణపురం, సాయి గణేష్ నగర్, జంగాల కాలనీ, రాఘవేంద్ర కాలనీలు ఉన్నాయి. అయితే ఇందిరమ్మ కాలనీకి ఇతర కాలనీలకు మధ్యన బైపాస్ రోడ్డు, జాతీయ ప్రధాన రహదారి ఉంది. గతంలో ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఇందిరమ్మ కాలనీ ఓటర్లు ఆయా పోలింగ్ బూత్‌లలో ఉండటం ద్వారా కనీసం వారి పోలింగ్ బూత్‌లు ఎక్కడ ఉన్నాయో తెలవకపోవడంతో పది శాతం మంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ దఫా మున్సిపాలిటీ అధికారులు కాలనీవాసులందరినీ 23వ డివిజన్ పరిధిలోకి తీసుకు రావడంతో సుమారు 500 మంది ఓటర్లు 23వ డివిజన్ పరిధిలోకి రావడం జరిగింది. ఈ డివిజన్‌లో మొత్తం 1,700 మంది ఓటర్లు ఉండటంతో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం అనివార్యమైంది. సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఇప్పటికే అమల్లో ఉండటంతో ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన అంగన్‌వాడీ కేంద్రం భవనంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే ఈ కాలనీవాసులు వందకు వంద శాతం తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. మొత్తం మూడు పోలింగ్ కేంద్రాల్లో ఒక పోలింగ్ కేంద్రం ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీవాసులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. లేనియెడల ఎన్నికల రోజున ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి సొంత వాహనాలలో ఓటర్లను ప్రలోభ పెట్టి పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని, దీంతో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని కాలనీవాసులు వాపోతున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి వృద్ధులు, దివ్యాంగులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని 23వ డివిజన్ ఇందిరమ్మ కాలనీవాసులు సంబంధిత అధికారులను విన్నవించుకుంటున్నారు. మరి ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా.. ఈసారైనా కాలనీవాసులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటారా లేదా అనేది వేచి చూడాలి.




# ఇక 'ట్రెజరీ' చెల్లింపులు

**కైలాస్‌నగర్:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల బిల్లుల చెల్లింపుల్లో కేంద్రం మార్పులు చేసింది. అక్రమాలను కట్టడి చేయడంతో పాటు పారదర్శతకు పెద్దపీట వేసేలా ట్రెజరీ ద్వారా చెల్లింపులు చేపట్టేందుకు నిబంధనలు రూపొందించింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది నుంచి చేపట్టనున్న ఉపాధిహామీ పనుల బిల్లులతో పాటు ఉద్యోగులు, సిబ్బంది వేతనాలను ఇక నుంచి ట్రెజరీ ద్వారానే చెల్లించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తేనే కేంద్రం నిధులు విడుదల చేసేలా మార్గదర్శకాలు సిద్ధం చేసింది. దీంతో బిల్లులు, వేతనాల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యానికి చెక్ పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**సకాలంలో చెల్లింపులు చేసేందుకే..**

ఉపాధిహామీ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్నారు. వాటికి సంబంధించిన వివరాలను స్పార్ష్ మాడ్యూల్‌లో నమోదు చేసేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులకు ఉపయోగించిన మెటీరియల్, కూలీల పనుల వివరాలను ట్రెజరీ శాఖకు అందించనున్నా రు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, అటవీ, ఐటీడీఏ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులన్నింటికీ ఈ నూతన విధానం అమలుకానుంది. ట్రె జరీ అధికారులు బిల్లులను ఆమోదించాక ఫైనాన్షి యల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు వాటా వివరాలు పంపిస్తారు. అక్కడి ఆధికారులు పరిశీలించి ఆమోదం తెలిపిన అనంతరం వాటికి సంబంధించి నిధులు విడుదల కానున్నాయి. మెటీరియల్ కంపోనెంట్ బిల్లులతో పాటు ఉపాధిహామీలో పనిచేసే ఏపీవో లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది వేతనాలనూ ఇక నుంచి ట్రెజరీ ద్వారా చెల్లించను న్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులందరి వేతనాలు సర్కారు ట్రెజరీకి పంపించి వేతనాలను జమ చేస్తోంది. అయితే నూతన విధానంలో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సబ్ ట్రెజరీల వారీగా వారికి వేతనాలు అందనున్నాయి. బిల్లుల చెల్లింపులు కూడా ఇలాగే జరగనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఒకేసారి విడుదల కానుండటంతో వారు వేతనాల కోసం ఇక నుంచి నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండదు. సకాలంలో వేతనాలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యే అవకాశముందనే అభిప్రాయాన్ని ఆ శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్ర వాటా విడుదల చేస్తేనే..**

ఇప్పటివరకు ఉపాధిహామీ పనులకు సంబరొధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకు న్నా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ వ చ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా విడుదలలో తీవ్ర జాప్యం చేసేది. దీంతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యమయ్యేది. ఇక నుంచి ఈ పరిస్థితి ఉండకూడదని భావించిన కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్ర ప్ర భుత్వ వాటాను ముందు విడుదల చేశాకే తన వాటాను విడుదల చేసేలా మార్గదర్శకాలు రూపొందిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లులకు సంబంధించిన వాటాలను ఒకేసారి విడుదల చేయనుండటంతో వాటి చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యానికి ఇక నుంచి చెక్‌పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మార్గదర్శకాలకు అనుగుణంగానే..**

ఉపాధిహామీ బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగానే బిల్లులను ట్రెజరీ ద్వారా చెల్లించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే జిల్లాలో చర్యలు తీసుకుంటాం. ఈ నిర్ణయంతో ఉపాధి ఉద్యోగులు, సిబ్బంది వేతనాల కోసం నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. బిల్లులు కూడా త్వరగా విడుదలయ్యే అవకాశముంది.

# అడవిలో అమ్మ.. పర్వతాపూర్ మైసమ్మ

**నవాబుపేట:** తరతరాలుగా కొలిచిన వారి కోర్కెలు తీరుస్తూ ఇష్ట దైవంగా పేరొందింది పర్వతాపూర్ మైసమ్మ దేవత. జిల్లాకేంద్రం నుంచి మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో 9 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో వెలిసిన మైసమ్మ ఆలయం కాకర్లపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో ఉంది. ప్రస్తుతం ఉన్న స్థలంలోనే ఓ నెమలి చెట్టు కింద పుట్టలో అమ్మవారి విగ్రహం బయట పడిందని పూర్వీకులు చెబుతున్నారు. కట్టెలు కొట్టి విక్రయించే వ్యక్తి అడవిలో దారి తప్పితే చెట్టుకింద ఉన్న ఓ శిల ప్రత్యేక కాంతి రూపంలో దారి చూపిందని.. మరుసటి రోజు ఆ వ్యక్తి గ్రామస్తులకు విషయం చెప్పి పూజలు చేయడం ప్రారంభించినట్లు ప్రతీతి.



**ఆది, మంగళవారం రద్దీ..**

జిల్లావాసులు చాలామంది కొత్త వాహనం కొనుగోలు చేసినా, ఏదేని శుభకార్యాలు, ఎన్నికల ప్రచారాలు దేవాలయం వద్ద పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. దీంతోపాటు ఆది, మంగళవారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించడం ఇక్కడ ప్రత్యేకం. కాగా ఆలయం అభివృద్ధి చెందుతుండటంతో ఇతర రోజుల్లో సైతం భక్తుల రద్దీ కనిపిస్తుంది.

**ఆలయ అభివృద్ధి..**

కాకర్లపహాడ్‌కు చెందిన నారాయణరెడ్డి మొదట ఆలయ నిర్మాణం చేపట్టారు. తాజాగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ.కోటితో అమ్మవారికి నగలు చేయించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. అలాగే గతంలో ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి లక్మారెడ్డి, నాటి ఎమ్మెల్యేలు ఎర్ర సత్యం, చంద్రశేఖర్, ఎర్ర శేఖర్, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రుమాండ్ల రామచంద్రయ్య తదితరులు రూ.కోట్లు వెచ్చించి ఆలయాన్ని అభివృద్ధి చేశారు.

**అన్ని ఏర్పాట్లు చేశాం..**

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశాం. బోనాల రోజు ఆలయానికి వచ్చే భక్తులందరూ ఆలయం వద్ద బోనాలు సమర్పించేందుకు సౌకర్యాలు కల్పించాం.

## బసంత్ నగర్ పంచాయతీ భవనం కోసం నిరసన



**పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్ నగర్ గ్రామపంచాయతీకి నూతన భవనం నిర్మించాలని గ్రామంలో ఇటీవల సర్పంచిగా పోటీచేసి ఓడిపోయిన తువ్వా సతీష్, మహిళలు ఆదివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ భవనం మహిళా సంఘం భవనంలో కొనసాగుతుందన్నారు. మహిళా స్వశక్తి సంఘాలకు భవనాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది, పాలకవర్గం ఉపయోగించడం మూలంగా మహిళలకి ప్రత్యేక భవనం లేకపోవడంతో మహిళా సమావేశాలన్నీ ఆరుబయట చెట్ల కింద నిర్వహించుకోవడం ఇబ్బందికరంగా మారిందని ఆందోళన చేపట్టారు. గతంలో బసంత్ నగర్ గ్రామపంచాయతీ ఉమ్మడి పాలకుర్తి గ్రామంలో కొనసాగింది. బసంత్ నగర్ గ్రామానికి స్థానికంగా కమ్యూనిటీ భవనం ఉన్నప్పటికీని, సదరు కమ్యూనిటీ భవనం స్థల వివాదంతో పంచాయతీకి పూర్తిస్థాయిలో భవనం లేకుండా పోయింది. అధికారులు వెంటనే స్పందించి బసంత్ నగర్ గ్రామానికి ప్రత్యేక గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని కోరారు. ఆయనకు మద్దతుగా పలువురు మహిళలు గ్రామస్తులు అండగా నిలిచారు

## ఐతరాజుపల్లి సర్పంచ్‌కు ఘన సన్మానం




**సుల్తానాబాద్ :** ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ దికొండ భూమేష్ కుమార్ ను స్నేహితులు ఘనంగా సన్మానం చేశారు. పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం 1990-1991 సంవత్సరం 10వ తరగతి గర్రెపల్లిలో చదివిన పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూమేష్ కుమార్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. భూమేష్ కుమార్ గతంలో వార్డు సభ్యుల నుంచి ఉపసర్పంచ్, ఎంపీటీసీగా అంచెలంచలిగా ఎదిగి ఎన్నో సేవా కార్యక్రమం చేసి ప్రజల మొన్ననలు పొందాడాని కొనియాడారు. ప్రస్తుతం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ గా కొనసాగడం అభినందనీయం అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు. విజయలక్ష్మి ,భారతి, గీత, రాజ్యలక్ష్మి, అరుణ, సునీత, వెంకన్న పటేల్, శ్రీనివాస్, దేవరాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఓంకార్, రామ్మోహన్, ధర్మారెడ్డి, గౌతం, గంగయ్య, సంపత్ రెడ్డి, ఉషకార్ రెడ్డి, మధుసూదన్ రావు, హనుమంత రెడ్డి, ఆంజనేయులు, మహేష్, రవీందర్ లతోపాటు తదితరులు ఉన్నారు.

## కోతులను తరిమేందుకు..
## గ్రామపంచాయతీ కార్యవర్గం విచిత్ర వేషధారణ



**అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎగ్లాస్ పూర్ గ్రామంలో కోతులను గ్రామం నుండి తరిమేందుకు గ్రామపంచాయతీ కార్యవర్గం వినూత్న ఆలోచన చేశారు. కోతులను గ్రామం నుంచి బయటకు పంపేందుకు గ్రామ సర్పంచ్ జూపాక మమత ఆధ్వర్యంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ యువత విచిత్ర వేషదారణతో గ్రామంలో కోతులను బయటకు పంపే ప్రయత్నం చేపట్టారు. కోతుల బారి నుండి కపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోతులు గ్రామంలోకి రాకుండా ప్రభుత్వం అధికారులు దృష్టి పెట్టి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. గ్రామాలలో కోతుల బెడతో బయటికి వచ్చే పరిస్థితులు లేవని, కోతులతో ప్రజలు రోజువారి పనులు చేసుకోలేక పోతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలపైన, వృద్ధుల పైన పడి దాడులు చేయడంతో ప్రజలు తీవ్రమైన భయాందోళనకు గురి అవుతున్నరన్నారు. గ్రామపంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో కోతులను తరిమేందుకు ప్రయత్నాలు చేపట్టమని తెలిపారు.

## అమెరికాకు వ్యతిరేకంగా
## గోదావరిఖనిలో నిరసన ప్రదర్శన

**కోల్‌సిటీ :** అమెరికా సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదం నశించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరస్ లను అమెరికన్ సైన్యం అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అమెరికా నియంత పోకడలకు వ్యతిరేకంగా మిన్నటిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఐకృష్ణ, ఇ.నరేష్ మాట్లాడుతూ.. అమెరికా ఐక్య రాజ్యసమితి నియమాలను, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించిందన్నారు. వెనిజులా దేశంలో ఆయిల్ సంపద, నిక్షేపాలను కొల్లగొట్టడానికి తప్పుడు ఆరోపణలతో ఆ దేశంపై దాడి చేసిన అమెరికా అహంకారం పద్ధతి కాదన్నారు. ఆ దేశ ప్రజల ప్రజాస్వామిక హక్కులపై అమెరికా దాడిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, చిలుక శంకర్, రామకృష్ణ, రాజేశం, మల్లేశం, కొంరయ్య, ఐఎఫ్ టి యూ నాయకులు మొండయ్య, రాజేందర్, గుండ రాజయ్య, ప్రసాద్, ఎల్లయ్య, ధర్మేందర్, చంద్రయ్య, గడ్డి రాజు, అజయ్, కాంపెల్లి మల్లేశం, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

## బిజినెస్

### గిగ్ కార్మికుల సామాజిక భద్రతకు 90 రోజుల పని నిబంధన



కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు సంబంధించిన సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద మొత్తం 120 రోజులు పనిచేయాలి. ఇటీవల గిగ్‌వర్కర్లు సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఒక రోజుకు ఒక అగ్రిగేటర్ వద్ద పని చేసినా,ఆ రోజు మొత్తం ఒక రోజుగా పరిగణలోకి వస్తుంది. ఒక గిగ్‌వర్కర్ అగ్రిగేటర్ కోసం చేసిన పనికి ఆదాయం సంపాదిస్తే, వారు ఎంత సంపాదించారనే దానితో సంబంధం లేకుండా, ఆ రోజున వారు పనిలో చేసినట్లుగా పరిగణలోకి వస్తుందని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ముసాయిదా నిబంధనలకు సంబంధించి తుది నోటిఫికేషన్‌కు ముందు అభిప్రాయాలు చెప్పాలని కేంద్రం కోరింది. 30–45 రోజుల వ్యవధిలో అభ్యంతరాలు మరియు సూచనలను ఆహ్వానించింది. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్‌లలోని అన్ని నిబంధనలను పూర్తిగా అమలు చేయాలనే కార్మిక మంత్రిత్వ శాఖ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇటీవల డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న గిగ్‌వర్కర్లు సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను వారు డిమాండ్ చేశారు. అలాగే, 10 నిమిషాల్లో డెలివరీ విధానాన్ని పూర్తిగా చేయాలని డిమాండ్ చేశారు.

### రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి

అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల డియా కథనాలు వెల్లడించాయి. 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. దీనిపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే భారత్‌పై 50 శాతం సుంకాలు వేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో తన వాణిజ్య లోటును తగ్గించుకోవాలని చూస్తోన్న యూఎస్‌ఏ.. వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా టారిఫ్‌ల ద్వారా భారత్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ పరిణామాల వేళ.. రష్యా, అమెరికా చమురు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ రిఫైనరీలను అడిగింది. ఈ సమాచారం ఇవ్వాలని పీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాతో చర్చల సమయంలో ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకుంటుందని డియా కథనాలు పేర్కొన్నాయి.

# బంగారం, వెండి ధరలు మరింత పెరుగుతాయా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సైన్యం వెనెజువెలా రాజధాని కారకాస్‌పై భారీ దాడులు చేసి, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి వంటి సేఫ్ హెవెన్ ఆస్తుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



**బంగారం, వెండి ధరలపై ప్రభావం**

భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినప్పుడు పెట్టుబడిదారులు బంగారం, వెండి వైపు మళ్లుతారు. ఈ దాడి కారణంగా అనిశ్చితి పెరిగి, సేఫ్ హెవెన్ డిమాండ్ పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుత ధరలు (జనవరి 4 నాటికి భారత మార్కెట్‌లో) 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,35,800 నుంచి రూ.1,37,000 వరకు (వీజశ ఫ్యూచర్స్ ప్రకారం) ఉంది. అలాగే 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు రూ.1,24,500. ఇక వెండి కిలోకు సుమారు రూ.2,40,000 నుంచి రూ.2,46,000 వరకు ఉంది.

**మరింత పెరిగే అవకాశం**

నిపుణుల అంచనా ప్రకారం.. ఈ ఉద్రిక్తతలు కొనసాగితే బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్‌కు 4,380 నుంచి 4,500 డాలర్లకు చేరవచ్చు. భారత్‌లో 10 గ్రాముల ధర రూ.1,40,000 స్థాయిని తాకే అవకాశం ఉంది. వెండి ధరలు మరింత గణనీయంగా పెరిగి, అంతర్జాతీయంగా ఔన్స్‌కు 75–78 డాలర్లకు చేరవచ్చని అంచనా. ఇది సప్లై చైన్ డిస్టర్బెన్స్ (వెనెజువెలా ప్రాంత షిప్పింగ్ రూట్లు ప్రభావితం) కారణంగా కూడా జరుగవచ్చు. అయితే, ఈ పెరుగుదల తాత్కాలికమే కావచ్చు. ఉద్రిక్తతలు తగ్గితే ధరలు స్థిరపడవచ్చు లేదా కొద్దిగా పడిపోవచ్చు. 2026లో మొత్తంగా బంగారం ధరలు ఔన్స్‌కు 5,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జియో 'కొత్త' ప్లాన్లు.. ఇక ఏడాదంతా సిమ్ యాక్టివ్

ముఖేష్ అంబానీకి చెందిన ప్రముఖ టెలికమ్ కంపెనీ రిలయన్స్ జియో.. ఎప్పటికప్పుడు చవక రీఛార్జ్ ప్లాన్లు, ఆఫర్లతో యూజర్లను ఆకట్టుకుంటోంది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల ప్లాన్లను అందుబాటులోకి తెస్తోంది. తాజాగా కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రతి నెలా నంబర్ ను రీఛార్జ్ చేసుకునే టెన్షన్ లేకుండా ఏడాది పొడవునా సిమ్‌ను యాక్టివ్‌గా ఉంచుకునే ప్లాన్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..




**రూ.3,599 ప్లాన్**

ఈ ప్లాన్ 365 రోజుల వాలిడిటీతో వస్తుంది. ఒక్కసారి రీచార్జ్ చేసి వదిలేసే వారి కోసం ప్రత్యేకంగా ఈ ప్లాన్‌ను రూపొందించారు. ఇందులో ఏడాది పొడవునా పాన్-ఇండియా రోమింగ్ తో అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ప్రతిరోజూ 2.5 జీబీ హైస్పీడ్ డేటా.. అంటే మొత్తం 912.5 జీబీ డేటా లభిస్తుంది. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపుకోవచ్చు. 5జీ కవరేజీ ఉన్న ప్రాంతాల్లో అపరిమిత 5జీ డేటాను ఉపయోగించుకోవచ్చు. ఇక జియో టీవీ, జియోఏఐ క్లౌడ్, గూగుల్ జెమిని ప్రో సబ్ స్క్రిప్షన్ అదనపు ప్రయోజనాలు.

**రూ.3,999 ప్లాన్**

లైవ్ స్పోర్ట్స్ ను ఇష్టపడే వ్యక్తుల కోసం ఈ ప్లాన్ ప్రత్యేకంగా రూపొందించింది జియో. ఈ ప్లాన్ ప్రీమియం ఓటీటీ సబ్ స్క్రిప్షన్ ను అందిస్తుంది. వ్యాలిడిటీ 365 రోజులు. పాన్-ఇండియా రోమింగ్ తో అపరిమిత కాలింగ్ ఉంటుంది. ప్రతిరోజూ 2.5 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. 5జీ కవరేజీ ఉన్న ప్రాంతాలలో అపరిమిత 5జీ డేటాను ఆనందించవచ్చు. ఫ్రీ ఫ్యాన్ కోడ్ యాప్ ఇందులో లభించే ఓటీటీ బెనిఫిట్. అదనపు ప్రయోజనాల విషయానికి వస్తే జియో టీవీ, జియోఏఐ క్లౌడ్, గూగుల్ జెమిని ప్రో వంటివి లభిస్తాయి.

**రూ .1,748 ప్లాన్**

కాలింగ్ ఒక్కటే ఉంటే చాలు మొబైల్ డేటా అవసరం లేదు అనుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ ఉత్తమమైనది. ఇందులో వ్యాలిడిటీ 336 రోజులు. అన్ని నెట్ వర్క్ లకు అపరిమిత కాలింగ్ చేసుకోవచ్చు. ఇది వాయిస్ ఓన్లీ ప్యాక్ కాబట్టి ఎలాంటి డేటా రాదు. 3,600 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. జియోఏఐ క్లౌడ్, జియో టీవీలకు యాక్సెస్ పొందుతారు


## స్పోర్ట్స్

# టీ20 వరల్డ్‌కప్‌కు పాక్ జట్టు ప్రకటన.. ఎట్టకేలకు స్టార్ ప్లేయర్‌కు చోటు

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 16 మంది సభ్యుల పాకిస్తాన్ ప్రొవిజనల్ జట్టును ఇవాళ (జనవరి 4) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా సల్మాన్ అఘా ఎంపికయ్యాడు. అతనికి డిప్యూటీని (వైస్ కెప్టెన్) ప్రకటించలేదు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఎట్టకేలకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. స్టార్ పేసర్ షాహీన్ అఫ్రిది సైతం ఈ జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, అతని ఫిట్‌నెస్‌పై ఆనిశ్చితి నెలకొంది. షాహీన్‌కు బ్యాకప్‌గా మరో పేసర్ హారీస్ రౌఫ్ ఎంపికయ్యాడు. షాహీన్ తాజాగా బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతూ మోకాలి గాయం బారిన పడ్డ విషయం తెలిసిందే. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ రీఎంట్రీ ఇవ్వగా.. వికెట్‌కీపర్ బ్యాటర్ మొహమ్మద్ రిజ్వాన్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. రిజ్వాన్ స్థానంలో ఉస్మాన్ ఖాన్ ప్రధాన వికెట్‌కీపర్‌గా ఎంపికయ్యాడు. మెయిన్ స్క్వాడ్‌ను శ్రీలంకతో టీ20 సిరీస్ తర్వాత (జనవరి 11) ప్రకటిస్తారు.

టీ20 ప్రపంచకప్ కోసం పాకిస్తాన్ ప్రొవిజనల్ జట్టు

- సల్మాన్ అలీ అఘా (కెప్టెన్)
- బాబర్ ఆజమ్
- షాహీన్ అఫ్రిది (ఫిట్‌నెస్ అనిశ్చితి)
- ఉస్మాన్ ఖాన్ (వికెట్ కీపర్)
- షాదాబ్ ఖాన్
- మొహమ్మద్ నవాజ్
- ఫహీమ్ అష్రఫ్
- హారిస్ రౌఫ్ (షాహీన్‌కు ప్రత్యామ్నాయం)
- ఫకర్ జమాన్



- మొహమ్మద్ వసీం జూనియర్
- నసీం షా
- అబ్దుల్ సమద్
- సాహిబ్‌జాదా ఫర్హాన్
- సైమ్ అయూబ్
- సల్మాన్ మీర్జా
- అబ్రార్ అహ్మద్

కాగా, టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ గ్రూప్–ఏ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఈ గ్రూప్‌లోనే టీమిండియా కూడా ఉంది. ఇతర జట్లుగా యూఎస్‌ఏ, నమీబియా, నెదర్లాండ్స్ ఉన్నాయి. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌తో పాక్ తమ వరల్డ్‌కప్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. దాయాదుల సమరం ఫిబ్రవరి 15న కొలొంబో వేదికగా జరుగనుంది.

### బ్రూక్, రూట్ అర్ధ శతకాలు.. తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం..!




మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొదటిసారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బోలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150 పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచినట్టే. వరుసగా..పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.

# టీ20 ప్రపంచకప్ కోసం బంగ్లాదేశ్ జట్టు ప్రకటన.. స్టార్ బ్యాటర్‌పై వేటు


ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యుల బంగ్లాదేశ్ జట్టును ఇవాళ (జనవరి 4) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా లిట్టన్ దాస్ వ్యవహరించనున్నాడు. అతనికి డిప్యూటీగా (వైస్ కెప్టెన్) మొహమ్మద్ సైఫ్ హస్సన్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఐర్లాండ్ సిరీస్‌కు దూరంగా ఉన్న పేసర్ తస్కిన్ అహ్మద్ రీఎంట్రీ ఇచ్చాడు. వికెట్ కీపింగ్, బ్యాటర్ జాకిర్ అలీ, బ్యాటర్ మహిదుల్ ఇస్లాం అంకోన్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఫామ్‌లో ఉన్నా, స్టార్ బ్యాటర్ నజ్ముల్ హసన్ షాంటోపై వేటు పడింది. కాగా, ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు గ్రూప్–సిలో పోటీపడుతుంది. ఈ గ్రూప్‌లో వెస్టిండీస్, ఇటలీ, ఇంగ్లండ్, నేపాల్ మిగిలిన జట్లుగా ఉన్నాయి. ఈ టోర్నీలో బంగ్లాదేశ్ ఫిబ్రవరి 7 నుంచి తమ జర్నీ ప్రారంభిస్తుంది.






# మెగా బ్లాస్ట్..
# చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' ట్రైలర్ విడుదల


అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి, స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ఈరోజు తిరుపతిలో గ్రాండ్‌గా విడుదల చేసింది. ట్రైలర్ అంతటా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి టైమింగ్ హైలైట్‌గా నిలిచాయి. చిరంజీవి తన వింటేజ్ కామెడీ అండ్ యాక్షన్ మేనరిజమ్స్‌తో అభిమానులను అలరించారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రైలర్ చివరిలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశం థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయమని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయింది.




## 'పుష్ప-2' రికార్డు దిశగా అడుగులు.. 800 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్'!


బాలీవడ్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సృష్టించిన సునామీ ఇంకా ఆగడం లేదు. బాలీవుడ్ చరిత్రలో మరే ఇతర హిందీ సినిమాకు సాధ్యం కాని రీతిలో ఈ చిత్రం సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. విడుదలైన ఐదో వారంలో కూడా మంచి కలెక్షన్లు సాధిస్తున్న ఈ సినిమా తాజాగా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ. 800 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టింది. దీంతో భారతీయ సినీ పరిశ్రమలో ఒక హిందీ సినిమా రూ. 800 కోట్ల మైలురాయిని అందుకున్న చిత్రంగా ధురంధర్ రికార్డులకెక్కింది. అలాగే ప్రస్తుతం బాలీవుడ్ మార్కెట్‌లో 'పుష్ప 2' (హిందీ వెర్షన్) అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు 'ధురంధర్' సాధిస్తున్న వసూళ్ల వేగాన్ని చూస్తుంటే అతి త్వరలోనే 'పుష్ప 2' లైఫ్ టైమ్ బిజినెస్ రికార్డును ధురంధర్ అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో హిందీ బెల్ట్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన నంబర్ వన్ చిత్రంగా అవతరించేందుకు 'ధురంధర్' కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది.

# సత్య 'జెట్లీ' గ్లింప్స్ రిలీజ్.. ఈ సారి కామెడీ మామూలుగా ఉండదు!




'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. సత్య, రియా సింఘా, వెన్నెల కిషోర్, అజయ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని నిర్మాత చెర్రీ తెలిపారు. 'మత్తు వదలరా' సిరీస్ తర్వాత వస్తున్న ఈ సినిమా, ప్రేక్షకులకు మరోసారి నాన్-స్టాప్ వినోదాన్ని పంచుతుందని దర్శకుడు రితేష్ రానా ధీమా వ్యక్తం చేశారు. ఇక వేసవి కానుకగా 'జెట్లీ' థియేటర్లలో సందడి చేయనుంది.

# బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్ 'శంబాల'.. హిందీ ట్రైలర్ రిలీజ్




టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసుందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నాటి నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) చిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబోతే, పాలకు బదలు రక్తం కారుతుంటుంది. ఆ ఆవుని చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊరి జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు. అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.



# పార్టీలకు పర్యాయపదంగా మారిన ఓర్రీ.. సెలబ్రిటీ సర్కిల్స్‌లో ఎందుకంత క్రేజ్?

ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి పేరు ఇప్పుడు బాలీవుడ్ పార్టీ కల్చర్‌కు సరికొత్త గుర్తింపుగా మారిపోయింది. స్టార్స్, గ్లామర్ భామలు, యంగ్ హీరోలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఓర్రీ తప్పకుండా ఉంటాడన్న మాట వినిపిస్తోంది. సెలబ్రిటీ పార్టీల్లో అతడి హాజరు అంటే ఫన్, హడావిడి, అన్‌ఎక్స్‌పెక్టెడ్ మూమెంట్స్ ఉంటాయనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా ఉంది. ఓర్రీ కెరీర్ విషయానికి వస్తే.. రిలయన్స్ సంస్థలో జాబ్ చేస్తూనే, నైట్ పార్టీలతో మరో వైపు ఆదాయం సంపాదించడం అతడి ప్రత్యేకతగా చెప్పుకుంటారు. ఈవెంట్స్, ప్రైవేట్ పార్టీల్లో అతడి ప్రెజెన్స్‌కు భారీ డిమాండ్ ఉంది. ఒక్కో ఈవెంట్‌కు లక్షల రూపాయల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటాడన్న టాక్ చాలాకాలంగా నడుస్తోంది. ఉద్యోగం కంటే కూడా ఈవెంట్ల ద్వారానే ఎక్కువ సంపాదన ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. అసలు ఓర్రీకి ఇంత క్రేజ్ ఎందుకంటే.. అతడు ఉన్న చోట ఎప్పుడూ సరదా వాతావరణం ఉంటుంది. జనాలను ఆటపట్టించడం, సరదాగా టీజ్ చేయడం, కాస్త ఇర్రిటేట్ చేసినట్టే కనిపించినా చివరకు నవ్వులు పూయించడం అతడి స్టైల్. అందుకే పార్టీ క్రౌడ్స్ అతడిని తెగ ఇష్టపడతారనే మాట వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో అతడి ఫ్యాషన్ సెన్స్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇక తాజాగా ఓ నైట్ పార్టీలో ఓర్రీ చేసిన పనికి అక్కడున్నవాళ్లంతా షాక్ అయినట్టు తెలుస్తోంది. సెల్ఫీల పేరుతో ఆడా, మగా తేడా లేకుండా అందరినీ హగ్ చేసుకుంటూ, కొందరికి స్వీట్ కిస్ ఇవ్వడంతో పార్టీలో చర్చనీయాంశంగా మారాడు. ఈ ఘటనలో తెలుగు నటుడు హర్షవర్ధన్ రాణే, నటి మౌని రాయ్ వంటి సెలబ్రిటీలు కూడా ఉన్నారట. కొందరికి ఇది ఫన్‌గా అనిపించగా, మరికొందరికి మాత్రం అనూహ్యంగా అనిపించిందని సమాచారం. ఇదిలా ఉండగా, ఓర్రీ త్వరలో నటుడిగా మారబోతున్నాడనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఇప్పట్లో అతడు పూర్తిగా ఇన్‌ఫ్లూయెన్సర్ కెరీర్‌పైనే ఫోకస్ పెట్టాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో నటనలోకి వస్తే హీరోగా కాకుండా, తనకు సెట్ అయ్యే క్యారెక్టర్ లేదా కామెడీ రోల్స్‌తో ఎంట్రీ ఇవ్వవచ్చని టాక్. మొత్తానికి, ఓర్రీ పేరు ఇప్పుడు సినిమాల కంటే పార్టీల్లోనే ఎక్కువగా వినిపిస్తోంది. సెలబ్రిటీ కల్చర్‌లో అతడు సృష్టిస్తున్న హడావిడి చూసి, రాబోయే రోజుల్లో అతడి క్రేజ్ ఇంకెంతవరకు వెళ్తుందో చూడాలని ఇండస్ట్రీ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

## రైతు కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం

# నిజమైన సామాజిక భద్రతా వరం



**డా. దామోదర రావు తానికొండ**
ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ (ఎస్సీ విభాగం)

ధర్మఘంట, జనవరి 04, హైదరాబాద్

గ్రామీణ భారతంలో రైతు కూలీలకు, ముఖ్యంగా దళిత – గిరిజన, బడుగు – బలహీన వర్గాలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీ నరేగా) ఒక చట్టం మాత్రమే కాదని, అది వారి జీవితాలకు భరోసా ఇచ్చిన ఒక చారిత్రాత్మక సామాజిక భద్రతా వ్యవస్థ అని ఏఐసీసీ ఎస్సీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ డా. తానికొండ దామోదర్ రావు స్పష్టం చేశారు. నేడు హైదరాబాద్‌లోని తన నివాసంలో ధర్మఘంట'తో మాట్లాడుతూ, కుల, మత, లింగ, ప్రాంత భేదాలకతీతంగా గ్రామీణ ప్రజలకు గౌరవంగా పనిచేసే హక్కును రాజ్యాంగాత్మకంగా బలోపేతం చేసిన ఏకైక చట్టం ఎంజీ నరేగా అని ఆయన పేర్కొన్నారు. నాటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్ట రూపకల్పనలో వామపక్షాల పాత్ర అత్యంత కీలకమైనదని, క్రియాశీలకమైనదని గుర్తు చేశారు. ఈ చట్టం కోసం అప్పట్లో కేంద్ర బడ్జెట్‌లో దాదాపు నాలుగు శాతం నిధులు – సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు కేటాయించడమే కాకుండా, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం వంద పని దినాల హామీని చట్టబద్ధంగా కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వెళ్లే వలసలు గణనీయంగా తగ్గాయని, రైతు కూలీలు గ్రామాల్లోనే గౌరవంగా జీవించగలిగారని, ముఖ్యంగా దళిత, గిరిజన వర్గాలకు చెందిన కూలీల కొనుగోలు శక్తి పెరిగి, నాణ్యమైన ఆహారం, ఆరోగ్యం, విద్య వైపు అడుగులు పడ్డాయని వివరించారు. సామాజిక ఆధిపత్యాన్ని నిలదీసే శక్తి ఈ చట్టం ఇచ్చిందని, అసమానతల అంతరాలు కొంతమేరకు అయినా తగ్గాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, "ఎంజీ నరేగా" కేవలం ఉపాధి కల్పించే పథకం మాత్రమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన కీలక స్థంభం అని ఆయన గుర్తు చేశారు. చెరువుల పునరుద్ధరణ, భూసంరక్షణ, నీటి నిల్వలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు, వ్యవసాయ ఉత్పాదకత పెంపు వంటి దీర్ఘకాలిక ఆస్తుల సృష్టిలో ఈ చట్టం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రకృతి విపత్తులు, కరువు మహమ్మారి వంటి సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రజలకు చివరి భరోసాగా "ఎంజీ నరేగా" నిలిచిందని చెప్పారు. అయితే, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ చట్టాన్ని క్రమంగా నీరుగార్చే ప్రయత్నాలు మొదలయ్యాయని డా. దామోదర్ రావు తీవ్రంగా ఆరోపించారు. పనిదినాలను ఆచరణలో తగ్గించడం, లబ్ధిదారుల కుటుంబాల సంఖ్యను క్రమంగా తగ్గించడం, ఆధార్ ఆధారిత చెల్లింపుల పేరిట అనేక మందిని పథకం నుండి వెలివేయడం, లక్షలాది జాబ్ కార్డులను రద్దు చేయడం వల్ల గ్రామీణ ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. యంత్రాల వాడకాన్ని పెంచడం ద్వారా మానవ శ్రమను పక్కన పెట్టడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వేతనాలను పెంచకపోవడం వల్ల కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మొదటి నుండే 'నరేగా' చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నమే బీజేపీ విధానమని, బడ్జెట్ కేటాయింపులు, పనిదినాలు, చెల్లింపుల విధానం అన్నింటిలోనూ చట్ట ఆత్మను హరిస్తూ వచ్చిందన్నారు. ఇప్పుడు చట్టం పేరును మార్చి 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గర్ అండ్ అజీవిక్ మిషన్ (గ్రామీణ్)' పేరుతో కొత్త బిల్లును ప్రతిపక్షాల సూచనలు, వ్యతిరేకతలను పట్టించుకోకుండా సభలను బుల్డోజ్ చేసి ఆమోదించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఎలాంటి సమగ్ర చర్చ లేకుండా వెంటనే ఆమోదం తెలపడం దురదృష్టకరమన్నారు. ఈ బిల్లు ప్రకారం పథకం అమలులో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపబడుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా చట్టంలోని జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం ఆయనకు చేసిన ఘోర అవమానం అని డా. దామోదర్ రావు ఆవేదన చెందారు. చట్టాన్ని పథకంగా మార్చడంలోనే పెద్ద కుట్ర దాగి ఉందని, చట్టాన్ని ఎత్తేయలేము కానీ పథకాన్ని ఎప్పుడైనా రద్దు చేయవచ్చని, ఇది పూర్తిగా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతుందని, అంటే గ్రామీణ ప్రజల ఉపాధికే ఎసరు పెట్టే ప్రయత్నమన్నారు. గాంధీ పేరును ఉచ్చరించడానికి కూడా ఇష్టం లేని రాజకీయ ద్వేషమే దీనికి కారణమని విమర్శించారు. గతంలో ఒక విదేశీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని గాంధీకి అంతర్జాతీయ గుర్తింపు సినిమా వల్లే వచ్చిందని వ్యాఖ్యానించడం తీవ్ర తెంపరితనమని అన్నారు. గాంధీ సినిమా వల్ల నటులకు గుర్తింపు వచ్చిందేమో కానీ మహాత్ముడికి కొత్తగా వచ్చిన గౌరవం ఏమీ లేదని స్పష్టం చేశారు. గాంధీని చంపిన గాడ్సేను పూజించే ఆరెస్సెస్ – బీజేపీ పరివారం ఇప్పుడు గాంధీ పేరును పథకాల నుంచీ తొలగించడం కూడా ఆ కుట్రలో భాగమేనని ఆరోపించారు. రేపు విశ్వవిద్యాలయాల నుంచీ గాంధీ పేరును, కరెన్సీ నోట్ల నుంచీ ఫోటోను తొలగించినా ఆశ్చర్యం లేదని, క్రమంగా గాంధీని జాతి జ్ఞాపకాల నుంచీ తొలగించే ప్రయత్నాలకు కేంద్రం తెరలేపిందని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ప్రధాని ఈ చట్టం కేవలం గుంటలు తవ్వడానికే పనికొస్తుందని వ్యాఖ్యానించడం గ్రామీణ కూలీలపై చేసిన అవమానమని, వారి జీవితాల్లో చిచ్చు పెట్టే కుటిల ఆలోచనలకు ఇది నిదర్శనమన్నారు. దీన్ని అడ్డుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఈ చట్టం ఎందరో గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగునింపిందని, బతుకుపై భరోసా కల్పించిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం పనిదినాలు పెంచుతున్నట్టు కాగితాల మీద చూపిస్తున్నదే తప్ప వేతనాల పెంపుపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని విమర్శించారు. ఎంజీ నరేగా కాస్తా విజి రాంజీగా మారిపోయిందని, పేదలకు జరిగే లాభాన్ని ప్రభుత్వం సమర్థించుకోలేకపోతున్నదన్నారు. పత్రికల్లో మాత్రం గొప్ప ప్రకటనలు గుప్పిస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు.

భవిష్యత్తులో ఉచితాలు ఉండబోవని ఆర్థికమంత్రి హెచ్చరిస్తూనే ఉండటం, ట్రంప్ సుంకాలు, జీఎస్టీ భారం వల్ల సామాన్యుడి జీవితం అతలాకుతలమవడం, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాల భ్రష్టుపట్టింపు, రక్షణ రంగం ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడులకు ఎర్రతివాచీ పరచడం – ఇవన్నీ కలిపి గత దశాబ్దంలో రెండు లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని కేంద్రం పార్లమెంటులోనే అంగీకరించిందని గుర్తు చేశారు. నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలలో కొట్టుమిట్టాడుతుంటే, ఇప్పుడు గ్రామీణ పేదలపై కూడా మోడీ ప్రభుత్వం కక్ష సాధిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో నిజమైన 'వికసిత భారత్' ఎలా సాధ్యమని? భవిష్యత్ భారత్ మరింత దుర్భరంగా మారబోతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఈ కేంద్ర ప్రభుత్వ దురాగతాలకు దేశ ప్రజలంతా స్పందించి నిలువరించాలని డా. తానికొండ దామోదర్ రావు పిలుపునిచ్చారు.

## యాదవ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరణ

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్**



ధర్మఘంట, జనవరి 04, సూర్యాపేట

జిల్లా పరిధిలోని చివ్వెంల మండలం దురాజ్ పల్లి గ్రామం లింగమంతుల స్వామి గుట్ట వద్ద యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ మరియు రిటైర్డ్ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టే జానయ్య యాదవ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జానయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఐక్యంగా రాజ్యాధికార పోరాటంలో భాగస్వాములు కావాలని, అగ్రవర్ణాల పార్టీలకు పనిచేయడం మానుకొని మన కోసం మనమే, మన నాయకుల కోసం మనమే పని చేసుకోవాలని, మన లీడర్ల వెంట మనమే నిలబడాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల నాయకులను ఎదగనివ్వకుండా తొక్కిపెడుతున్నారని, సమాజంలో సంఖ్యాబలం ఉన్న వర్గాలకు పాలనలో సరైన స్థానం లేదని, తక్కువ జనాభా ఉన్న అగ్రకులాల నాయకులు రాజకీయాలను తమ చేతుల్లో పెట్టుకొని మనల్ని ఆడిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. యాదవ లీడర్లకు, యాదవ యువతకు కూడా వివిధ అగ్రకులాల పార్టీలలో సరైన గుర్తింపు, పదవులు ఇవ్వడం లేదని, సమాన న్యాయం లేకపోతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మట్టపల్లి రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ తో పాటు తండు శ్రీనివాస్ యాదవ్, పోలబోయిన నర్సయ్య యాదవ్, మర్యాద సైదులు, బొబ్బల గోపాలకృష్ణ, పచ్చిపాల శ్రీనివాస్ యాదవ్ మరియు పలువురు సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. టి ఆర్ పి నాయకులు వట్టె జానయ్య యాదవ్ తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బొల్లె సైదులు, అరాల రమేష్, వట్టె లింగరాజు, వల్లాల బుచ్చయ్య, ఉప్పల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలోని మంత్రులు, ఎంఎల్ ల అవినీతి పై దుమ్మెత్తిన జాగృతి అధ్యక్షురాలు కవిత పత్రికా విలేకర్ల సమావేశం



ధర్మఘంట, జనవరి 04, సూర్యాపేట

జిల్లా కేంద్రంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన జాగృతి కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏరియాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ తుంగతుర్తిలో ఉన్న కస్తూర్బా కాలేజీని మార్చాలి 100 పడకల హాస్పిటల్ కు రెండుసార్లు శంకుస్థాపన తుంగతుర్తిలో వంద పడకల హాస్పిటల్ కట్టించాలి వెలుగుపల్లిలో రుద్రమ్మ చెరువుకు రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి. నూతనకల్ బ్రిడ్జి కూలడానికి సిద్ధంగా ఉంది త్వరితగతిన పూర్తి చేయాలి. తుంగతుర్తిలో మిషన్ భగీరథ నీరు 20 రోజుల నుంచి రాక ఇబ్బందులు, సూర్యాపేటలో ఇండ్లు కూల్చారు, పరిహారం మరిచారు కూల్చేటప్పుడు అన్ని డిపార్ట్మెంట్ వాళ్ళు ఉన్నారు. పరిహారం కోరితే మాకు సంబంధం లేదు సూర్యాపేటలో 300 మంది ఉపాధి కోల్పోయారు. పుల్లారెడ్డి చెరువు ట్యాంక్ బండ్ కడతాను ఇంతవరకు దాని ఊసేలేదు. సూర్యాపేటలో సిసి రోడ్లు మొత్తం ఆగం చేస్తున్నారు. సూర్యాపేటలో ఇండ్ల పట్టాలు ఇచ్చారు, ఇంతవరకు పూర్తికాలేదు. జగదీశ్ రెడ్డి దత్తత తీసుకున్న చీదెళ్ళ గ్రామం రోడ్ల పరిస్థితి అధ్వాన్నం, కలెక్టరేట్ ఊరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. దానిని ఊరు మధ్యలో కట్టాలి. సూర్యాపేటలో ఒకప్పుడు కర్నాల చెరువు ఇప్పుడు కబ్జాకు గురైంది. చివ్వేంల మండలం ఉండ్రుగొండలో జగదీష్ రెడ్డి అనుచరులు ఆరెకరాల భూమిని కబ్జా చేశారు ఆటోనగర్ కు 50 ఎకరాలు స్థలం ఇస్తా అని ఐదు ఎకరాల స్థలానికి కూడా దిక్కులేదు. గతంలో జగదీష్ రెడ్డి తల్లి జ్ఞాపకంగా పాత ఎస్పీ ఆఫీసులో కబడ్డీ పోటీల అప్పుడు ప్రమాదం జరిగి ఒకరు చనిపోగా 26 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి ఇంతవరకు వారిని జగదీష్ రెడ్డి పట్టించుకోలేదు నాగారంలో సర్పంచ్ ఎన్నికల్లో ఓటుకు పదివేలు ఇచ్చి తండ్రిని గెలిపించుకున్న జగదీష్ రెడ్డి అని నాయకులపై గాటుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలు





ధర్మఘంట, జనవరి 04, నల్లగొండ

నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి జన్మదిన వేడుకలు శివాజీ నగర్ టీటీడీ కళ్యాణ మండపం దగ్గర ఎంపీ రఘువీర్ నల్గొండ టీం కార్యాలయం నందు కేక్ కట్ చేసి పేదలకు చీరలు పండ్లు పంపిణీ చేసి పెద్ద సంఖ్యలో బాలసంచా పేల్చి సంబరాలను నల్గొండ నడిగడ్డ మీద మొట్టమొదటిసారిగా జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘువీరారెడ్డి వర్గీయులు వనమాల రమేష్ నేత బృందంచే ఇట్టి కార్యక్రమము నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమా నికి చేపల యాదయ్య, పచ్చల సోమేశ్వరాలయం పానగల్ శివాలయం చైర్మన్ మరియు నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ చింతల వరప్రసాద్ యాదవ్ నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు గుండెబోయిన రాములు యాదవ్ ఐఎన్టియుసి నల్గొండ జిల్లా అధ్యక్షులు మరియు కందుల విజయ్ కుమార్ నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ చైర్మన్ చిట్యాల సయ్యద్ టిపిసిసి మైనార్టీ వైస్ చైర్మన్ మరియు నకరికల్ బొప్పని యాదగిరి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు కోట్ల సునీత దేవి ఆల్ ఇండియన్ సొసైటీ నల్గొండ జిల్లా అధ్యక్షులు మరియు డబ్బికా రాజా జిల్లా ఉపాధ్యక్షులు బీసీ సంఘం మరియు భీమనపల్లి సైదులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు లక్ష్మి శ్రీనివాస్ నాయక్ నల్గొండ పట్టణ కాంగ్రెస్ మహిళా కార్యదర్శి మరియు బడుగు ముత్యాలు నేత నల్గొండ పట్టణ పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు మరియు భేతి స్వామి నేత భావన రుషినేత నగేష్ ముదిరాజ్ మరియు కట్ట సుధాకర్ రెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు గోలి శ్రావణి రెడ్డి నల్గొండ జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షులు చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఓబీసీ ఎడ్ల మహాలింగం మరియు కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి అమ్మ రోజు సత్తయ్య చిట్యాల మరియు జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ కొల్లి మురళి నల్గొండ లేబర్ ట్రైన్ యూనియన్ కారం స్వామి మరియు నల్గొండ జిల్లా కోర్టు సీనియర్ లాయర్ సత్యనారాయణ చారి జర్నలిస్ట్ యూనియన్ లీడర్ మక్కపల్లి అంజయ్య ఉదయ్ నేత రజిత ఇంట వెంకన్న దాసరి కృష్ణ బొబ్బలి శ్రీకాంత్ టీచర్ సతీష్ యాదవ్ శివాజీ నగర్ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# క్రీడాకారులు ఆత్మ విశ్వాసంతో ఆటలు ఆడాలి

## కబడ్డీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కుంభం రాంరెడ్డి





ధర్మఘంట, జనవరి 04, సూర్యాపేట

కబడ్డీ క్రీడాకారులు ఆత్మ విశ్వాసం తో ఆటలు ఆడాలని మోడరన్ కబడ్డీ ఫెడరేషన్ అఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కుంభం రాంరెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట లోని పబ్లిక్ క్లబ్ లో 3వ మోడరన్ కబడ్డీ నేషనర్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 4 నుంచి 10 వరకు కబడ్డీ క్రీడాకారులకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి 60 మంది కబడ్డీ క్రీడాకారులకు కోచింగ్ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి మోడరన్ కబడ్డీ జిల్లా అధ్యక్షులు రామసాని రమేష్ నాయుడు అధ్యక్షత వహించారు. జాతీయ టెక్నికల్ డైరెక్టర్ రాజారావు, ప్రధాన కార్యదర్శి టి .రవికుమార్, పి డి పటేల్ నరసింహారెడ్డి, మోడరన్ కబడ్డీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ పటేల్ శ్రీధర్ రెడ్డి, ఎం ఎస్ రాజు, తిరుపతి, వీరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అన్నలా తోడుంటా





**అంధత్వాన్ని అవకాశంగా మార్చిన మహనీయుడు బ్రెయిలీ**

**బ్రెయిలీ లిపి క్యాలెండర్ ఆవిష్కరణ**

హైదరాబాద్

దివ్యాంగులకు అన్నలతోడు ఉంటానని ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అందులకు మాత్రమే కాదు, సమాజానికే వెలుగు చూపిన మహనీయుడని పేర్కొన్నారు. అంధత్వాన్ని శాపంగా కాకుండా అవకాశంగా మార్చిన వ్యక్తి బ్రెయిలీ అని, ఆయన ఒక వ్యక్తి కాదని ఒక ఆలోచన, ఒక ఉద్యమమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని, తాను శాఖ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు అవుతోందని, ఈ కాలంలో దివ్యాంగుల సమస్యలపై నిరంతర దృష్టి పెట్టి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని చెప్పారు. తాను ఒక మంత్రి మాత్రమే కాదని, దివ్యాంగులకు అన్నలా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం పదవ తరగతి వరకే బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అనేక మంది దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపామని, రానున్న రోజుల్లో ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీ స్థాయి వరకు బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ దిశగా త్వరలోనే జీవో జారీ చేసి, దివ్యాంగ విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తన పరిధిలో ఉన్న మేరకు వెంటనే పరిష్కరిస్తానని, తన పరిధిలో లేని అంశాలను సి.ఎం రేవంత్ రెడ్డితో చర్చించి నూటికి నూరు శాతం కృషి చేసి పరిష్కారానికి తీసుకెళ్తానని మంత్రి అన్నారు. ఉద్యోగాలు, రిజర్వేషన్లు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దివ్యాంగులే గౌరవంతో జీవించే శక్తివంతమైన పౌరులని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల బస్సు ప్రయాణ సమస్యపై వేదికపై నుండే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో ఫోన్‌లో మాట్లాడారు. దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించే అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన అంధ విద్యార్థులు ఆలపించిన పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రొఫెషనల్ గాయకుల స్థాయిలో విద్యార్థులు పాటలు పాడటం అభినందనీయమని మంత్రి పేర్కొంటూ, ఇందుకు కీలకంగా కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగులకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన గొప్ప వరమని, ఈ సేవ ద్వారా సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు సంబంధించిన సమస్యలు, ఉద్యోగ భద్రత, క్యాడర్ స్ట్రెంత్ అంశాలపై బోర్డు మీటింగ్‌లో చర్చించి త్వరలోనే పరిష్కారం చూపుతామని తెలిపారు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడుతున్న వివిధ సంఘాలతో అధికారుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో తొలిసారిగా బ్రెయిలీ లిపిలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవిష్కరించారు. అలాగే అంధ పాఠశాల విద్యార్థులకు సంగీత పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాంజెండర్ల సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అందుల సంఘాల ప్రతినిధులు, దివ్యాంగ అసోసియేషన్ నాయకులు, వివిధ అందుల పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అంధ విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# నిజాయితీ ఉద్యోగులకు సమాజంలో గౌరవం : శివసేనారెడ్డి

## క్రీడాభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటాం





నిజాయితీతో, నిబద్ధతతో విధులు నిర్వహించే ఉద్యోగులకు సమాజంలో తప్పనిసరిగా గౌరవం లభిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ లో దాదాపు 37 సం. సైక్లింగ్ కోచ్‌గా సేవలందించిన జి.చంద్రా రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశం ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రోమ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివసేనారెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ కోచ్‌గా, స్టేడియం అడ్మినిస్ట్రేటర్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ దాదాపు 225 జాతీయ స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులను తీర్చిదిద్దిన చంద్రా రెడ్డి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే కాకుండా, వారు గౌరవప్రదమైన ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేలా శిక్షణ అందించిన చంద్రా రెడ్డిని యువ కోచ్‌లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సీఎం కప్2024 నిర్వహణలో చంద్రా రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. క్రీడాభివృద్ధి కోసం రిటైర్డ్ కోచ్‌లు, అధికారుల అనుభవాన్ని వినియోగించుకునేలా స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తుందని శివసేనారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఓయూ సైక్లింగ్ వేలోడ్రోమ్‌లో శిక్షణ పొంది వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన సైక్లిస్టులు చంద్రా రెడ్డిని ఘనంగా సన్మానించి పాదపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఏవో అనిత, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, స్పెషల్ ఆఫీసర్ భాష, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్లు శోభ, జనార్దన్ రెడ్డి, మనోహర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు నందకిషోర్, గోకుల్, సుధాకర్ రావు, వెంకటేశ్వర రావు, స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, రిటైర్డ్ కోచ్‌లు, రిటైర్డ్ సిబ్బంది, పెద్ద ఎత్తున సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# వెనిజులాపై అమెరికా సైనిక దాడి అప్రజాస్వామికం

**వెనిజులా అధ్యక్షుడు మధురో అరెస్టుకు సిపిఐ ఖండన**



**కుత్బుల్లాపూర్** : బొలివేరియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నీచంగా సార్వభౌమాధికార నియమాలను ఘోరంగా ఉల్లంగిస్తూ వైమానిక దురాక్రమణ దాడులకు పాల్పడి వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అత్యంత దుర్మార్గ, చట్టవిరుద్ధ పద్ధతుల్లో అరెస్టు చేయదడాన్ని నిరసిస్తూ సిపిఐ జగతగిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో గుట్ట ఔటపోస్ట్ దగ్గర ట్రంప్ కు వ్యతిరేకంగా నిరసన చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్ మాట్లాడుతూ మూడో ప్రపంచ దేశమైన వెనుజులాపై అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను వారు తీవ్రంగా ఖండించారు. ఆ దేశ ప్రజలచే ప్రజాస్వామ్యంగా ఎన్నికైన దేశాధ్యక్షుడిపై, ఆయన కుటుంబంపై ఇలాంటి బెదిరింపులు, అరెస్టులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, మానవ హక్కులకు, ఐక్యరాజ్య సమితి నియమ, నిబంధనలకు దేశాల సార్వభౌమత్వాలను ఉల్లంగించడమని వారు అన్నారు. వెనిజులా ప్రజల తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో అమెరికా సామ్రాజ్యవాదం రాజకీయ, న్యాయ, సైనిక మార్గాల్లో సాగిస్తున్న దాడులేనని వారు విమర్శించారు. ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా అని, ఆ నిల్వలను దోచుకోవాలనే నీచ కుట్రలతో, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఒక దేశ నాయకత్వాన్ని నేరస్తులుగా ముద్రవేసి అరెస్టు చేయాలనుకోవడం ఆధునిక వలసవాద దురహంకారానికి ప్రతిరూపమని తెలిపారు. ఇవి అధ్యక్షుడు మధురోపై జరిగిన వ్యక్తిగత దాడులు మాత్రమే కాదనీ, ఇవి మొత్తం వెనిజులా ప్రజలపై, వారి స్వాతంత్రంపై హక్కులపై జరిగిన దాడులని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు వెనిజులా ప్రజల పోరాట సంకల్పాన్ని బలహీనపరచలేవనీ, అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గమైన అరెస్టులను వెంటనే ఖండించాలన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని తక్షణమే ఆపాలనీ, ఆ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, భారత ప్రభుత్వం కూడా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద దౌర్జన్యానికి వ్యతిరేకంగా భారత్ దేశ ప్రభుత్వ, ప్రజలు నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, సిపిఐ నాయకులు రవీ, సామెల్, నారాయణ, యాదగిరి, సైదులు, వెంకన్న, యాకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఎస్ ఆర్ టి నేషనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ :** ఐ ఎస్ ఆర్ టి నేషనల్ కౌన్సిల్ మీటింగ్ శనివారం లకిడికపూల్ లోని వుడ్ బ్రిడ్జి హోటల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఐ ఎస్ ఆర్ టి నేషనల్ ప్రెసిడెంట్ మోహన్ లాల్ భగవత్ సమక్షంలో 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డేనియల్, శ్రీకుమార్, ఆదిత్యా, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ గౌడ్, టోనీ అంథోనీ, నర్సింహులు, రాష్ట్ర సభ్యులు గంగాధర్, రాజు, రహిమ, మానస, మహదేవ్ చిలాల్, అన్సారీ మిగతా ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ పాల్గొన్నారు.

## అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ లో ఆకట్టుకుంటున్న నిత్య ప్రదర్శనలు

**మాదాపూర్ :** మాదాపూర్ లోని శిల్పారామంలో అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భాంగా





చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవి. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం, కూచిపూడి, తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నవి. లండన్ నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారులూ వరుణ్ శివకుమార్ ప్రదర్శన, యు.ఎస్ కాలిఫోర్నియా నుండి విచ్చేసిన రాజేష్ చావళి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించాయి. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ వారు పంపించిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శన రాజన్ బృందం ఎంతగానో అలరించారు.

## శరభ సేవా సమితి ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ఉత్సవాలు

**కొంపల్లి :** కొంపల్లి డివిజన్ పరిధిలోని పోచమ్మగడ్డ కాలనీలో కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్ నిర్వహించిన ముగ్గుల పోటీలను ప్రారంభించడం



జరిగింది. ఈ కార్యక్రమంలో అశ్రీత హాస్పిటల్ డైరెక్టర్ బర్మా వెంకటేశ్వర్ రావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కందడి సుదర్శన్ రెడ్డి, దానం పూర్ణచందర్ రావు, అంజి ముదిరాజ్, బైరి శ్రీను, బస్తీ వాసులు ఏశ్వంత కుల్కర్ని, పూర్ణచందర్ గౌడ్, మేడగిరి శ్రీనివాస్, శరభ సేవ సమితి సభ్యులు మనోజ్, సంతోష్, శివాజీ సేవ సమితి సభ్యులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంకట పాపయ్య నగర్ కాలనీ క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్ కాలనీ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన వెంకట పాపయ్య నగర్ సంక్షేమ సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని వారి చేతులమీదుగా క్యాలండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరంలనే ఈసారి కూడా




వెంకటపాపయ్య నగర్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించుకోవడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, జూపల్లి జనార్దన్ రావు, ఆర్.నాగేశ్వరరావు, దేవేందర్, జీవన్ రెడ్డి, రాందాస్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, మహీందర్ రావు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**మంగపేట**

ప్రలోబాలకు గురి చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభివృద్ధిని చూసి, అవగాహన చేసుకుని బి.ఆర్.ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రలోభాలతో ఆకర్షించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కొనలేరని.. అదేవిధంగా ప్రజలు బిఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని, దొంగ హామీలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు గద్దెనెక్కి లక్షల కోట్ల అవినీతి చేసి వాటాల పంపకంలో తేడా వచ్చి ఇప్పటికి కల్వకుంట్ల కుటుంబం కొట్టుకుంటున్నారని అన్నారు. పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల నాయకుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మరియు మండల ఇన్చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న ల ఆధ్వర్యంలో ఏటూరు నాగారం మండలం, రాంనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిన్న ప్రలోభాలకు గురిచేసి బి.ఆర్.ఎస్ పార్టీలో చేర్చుకోవడం జరిగింది. అధికార పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి అవగాహన చేసుకుని రెండవ వార్డ్ సభ్యులు వంకల శ్రీలత మరియు కాంగ్రెస్ నాయకులు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రలోభాలకు ఆకర్షితులను చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కొనలేరని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రలోభాలకు గురి చేసినా అవగాహన చేసుకుని మళ్లీ కాంగ్రెస్ లోకి చేరడం జరుగుతుందన్నారు. దళితుడిని సీఎం చేస్తా, దళితులకు మూడెకరాల భూమి, బంగారు తెలంగాణ నిర్మాణం, నిరుద్యోగ



భృతి, బిసి రిజర్వేషన్లు, దళిత బంధు, రైతులకు ఉచిత ఎరువులు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం అంటూ అనేక దొంగ హామీలను ఇచ్చి, గద్దనెక్కి పదేళ్లు ప్రజలను మోసం చేసి, కుటుంబ పాలనతో లక్షల కోట్ల అవినీతి చేసి వాటాల పంపకంలో తేడా వచ్చి ఇప్పటికి కొట్టుకుంటున్న కల్వకుంట్ల కుటుంబీకులను తెలంగాణ సమాజం అర్థం చేసుకొని గద్దె దింపిందని అన్నారు. ఇకనైనా ప్రజలను, మా కార్యకర్తలను మభ్యపెట్టి ప్రలోభాలకు ఆకర్షితులను చేసి కొనలేరని, అదేవిధంగా తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని గుర్తు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లె గాలిబ్, బొల్లె పెద్దన్న, మోహన్, వంకాయల భూమయ్య, గద్దె జయకృష్ణ, బంటు ఉదయ, పోడెం రాంబాబు, రమేష్, మంజుల, ప్రశాంత్, మనోజ్, అల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలు ఉత్తుత్తివే

## – రామ్ నగర్‌లో బీఆర్ఎస్ ప్రభంజనం
## – ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**మంగపేట**

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా ముంచుతోంది. ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలు కేవలం ఓట్ల కోసమే తప్ప, ప్రజల సంక్షేమం కోసం కాదని తేలిపోయింది“ అని ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు ధ్వజమెత్తారు. ఈ రోజు రామ్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్, వంక మల్ల లత – భూమయ్య కాంగ్రెస్ పార్టీ వైఖరి నచ్చక 40 మంది కార్యకర్తలు , రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి లక్ష్మణ్ బాబు గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడారు.

**కాంగ్రెస్ పార్టీ 420 హామీల వంచన..**

అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అమలు సాధ్యం కాని 420 హామీలను గుప్పించింది. ఇవాళ ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోంది. రైతులకు రుణమాఫీ లేదు, మహిళలకు మహాలక్ష్మి సాయం లేదు. ఈ అబద్ధపు మాటలను గమనించే రామ్ నగర్ ప్రజలు ఇవాళ స్వచ్ఛందంగా బీఆర్ఎస్ వైపు వస్తున్నారు.“ బిఆర్ఎస్ అభివృద్ధి పథకాలే మా సాక్ష్యాలు. “కేసీఆర్ గారి హయాంలో జరిగిన అభివృద్ధి ప్రతి గడపకూ చేరింది. ముఖ్యంగా రామ్ నగర్ వంతెన (బ్రిడ్జి) నిర్మించి దశాబ్దాల మీ రవాణా కష్టాలను తీర్చిన చరిత్ర మాది.. కళ్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు, రైతుబంధు వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం. మేము చేసిన పనులు కళ్ల ముందు కనిపిస్తున్నాయి కాబట్టే, అధికార పార్టీలో ఉండి కూడా వార్డ్ మెంబర్ మన పార్టీలోకి వచ్చారు.“ ఆనాడు కెసిఆర్ నాయకత్వంలో రైతులకు రైతు బంధుతో పంట పెట్టుబడి ఇచ్చి ఆదుకున్నాం. నేడు



కాంగ్రెస్ హయాంలో రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు. ఎరువులు, విత్తనాల కోసం రైతులు అల్లాడుతున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం హామీలను తుంగలో తొక్కి కాలం వెళ్లదీస్తున్నారు.

**“రామ్ నగర్ నుండి మొదలైన మార్పు..**

“అధికార పార్టీ పదవిలో ఉండి కూడా వార్డ్ మెంబర్ గారు మన దగ్గరకు వచ్చారంటేనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి ఇది నిదర్శనం. ములుగు జిల్లాలో అభివృద్ధి జరగాలంటే అది కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. మన కుటుంబంలో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని నేను గుండెల్లో పెట్టుకుంటాను.“ అని లక్ష్మణ్ బాబు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో వార్డ్ మెంబర్ వంకాయల లత – భూమయ్య, తోట తిరుమలరావు, పెనుమచ్చ రమేష్, గంగరాజు, గగ్గురి నరసింహులు, బొల్లె కొమరయ్య, గర రాములు, గర శ్రీను, గజ్జురి మల్లయ్య, తోట రమేష్, బొల్లె శారద, బొల్లె సరిత, అల్లి స్వామి, అల్లి రామక్క, బొల్లె నర్సయ్య, గార చిట్టి, గగ్గురి గణేష్, తోట స్వప్న, గగ్గురి రాజేష్, గగ్గురి రాజేశ్వరరావు, దోమల వెంకటేష్, పుట్ట శ్రీను, నూక రాజేష్, శశిరేఖ, బాసిక శోభన్, నలమాసుల భారతి, చిత్తు బత్తుల సమ్మక్క, తోట రామ్ కుమార్, చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంనగర్ సర్పంచ్ పోరిక సరిత– శ్రీను, గార ఆనంద్, ఉప సర్పంచ్ గార గాంధీ, మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రతీప్ రావు, తాడూరి రఘు, ఎండి ఖాజా పాషా, సయ్యద్ సర్దార్ పాష, కర్రె రవీందర్, అల్లి శ్రీను, ఎగ్గడి కోటయ్య, మల్లయ్య, సప్పిడి రాంనర్సయ్య, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, కొండాయి చిన్ని, రామ్ నగర్ గ్రామ కీలక నాయకులు, రైతులు, మహిళలు మరియు యువత భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# భద్రాద్రిలో వైకుంఠ ద్వార దర్శన మహోత్సవం





**భద్రాచలం**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా, భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి, శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా, అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష ఆరాధనలు, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, శరణాగతి గజ్జగరుడ దండం, భక్త రామదాసు రచించిన దాశరథి శతక పఠనం నిర్వహించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్త రామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూల విరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకకు భద్రాచలం, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ పిఓ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ దొర తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

**వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం – జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, భక్తులకు, పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఖ

## విధులకు హాజరు కాని వార్డెన్‌ని సస్పెండ్ చేయాలి

**– ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు దీకొండ భరత్**








**గోవిందరావుపేట**

మండల కేంద్రంలోన ఎస్సీ బాయ్స్ హాస్టల్లో రెగ్యులర్ గా విధులకు రాక విద్యార్థులకు వార్డెన్ పేరు తెలియని పరిస్థితి ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దీకొండ భరత్ అన్నారు. మండలంలోని వివిధ హాస్టళ్ళు సర్వే చేయడం జరిగింది అన్నారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్ లోనే విద్యార్థులను పట్టించుకోవడంలేదని వారన్నారు. అదేవిధంగా విద్యార్థులకు బాత్రూములు ఒక్కటి కూడా పూర్తిగా పనిచేయడం లేదని, వంట వండటానికి ఒక్కరూ కూడా లేక వంటలు వర్షానికి నానుడు ఎండకు ఎండుడు, కనీసం వాటర్ ట్యాప్స్ లేవని, స్నానాలు చేసే దగ్గర పాకురు, పాకురు ఉండడం వలన గతంలో పలుమార్లు వార్డెన్ కి చెప్పిన కానీ విద్యార్థుల సమస్య పట్టించుకోవటం లేదని వారు అన్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి ఆ హాస్టల్ వార్డెన్ ని విచారణ జరిపి విధుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో హాస్టల్లో ఉన్న విద్యార్థులను సమీకరణ చేసి భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## భవన నిర్మాణ కార్మికుల వాహనం బోల్తా..!

**– ఒకరి మృతి, పలువురికి గాయాలు**



**వాజేడు**

ములుగు జిల్లా, వాజేడు మండలం, మండపాక వద్ద భవన నిర్మాణ కూలీల బొలెరా ట్రాలీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కూలీలు మంగపేట మండలం, కమలాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు. క్షతగాత్రులను 108 వాహనంలో ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటాపురం మండలంలో ఇంటి నిర్మాణ స్లాబులు వేయడానికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాదారులు అతివేగంగా రావడంతో ఘటన జరిగిందని స్థానికుల వెల్లడించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జిల్లాలో మొదటి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం**

జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ కీలక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు. జిల్లాలో టెట్ పరీక్షల నిర్వహణ కోసం మొత్తం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజ్ నందు ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లకు కలిపి 200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, మొదటి సెషన్‌కు 44 మంది, రెండవ సెషన్‌కు 38 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. అలాగే అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లకు కలిపి 200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, మొదటి సెషన్‌కు 60 మంది, రెండవ సెషన్‌కు 74 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ విధంగా మొదటి రోజు టెట్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 400 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, అందులో 216 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరై, 184 మంది అభ్యర్థులు గైహాజరు అయినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ అమలు చేస్తూ ప్రశాంత వాతావరణాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. టెట్ పరీక్షల నిర్వహణలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పర్యవేక్షకులు, సిబ్బంది, పోలీసు శాఖ అధికారుల సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించగలిగామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మిగిలిన పరీక్షలు కూడా ఇదే విధంగా ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ఎంపీడీవో జమాల రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సర్పంచుల బృందం



**బూర్గంపహాడ్**

ఇటీవల నూతనంగా ఎన్నికైన బూర్గంపాడు మండల సర్పంచ్‌ల బృందం ఎంపీడీవో జమాలా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు హాజరై ఎంపీడీవో కి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల సర్వతోముఖ అభివృద్ధి, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, పంచాయితీలతో సమన్వయం పెంపొందించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వగా, సర్పంచ్‌లు కూడా అధికారులతో కలిసి సమిష్టిగా పనిచేస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ భేటీలో మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక ఇవ్వాలి




**మంగపేట**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ దళితుల సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద అనిల్ తెలంగాణలో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ఉచితంగా ఇసుక ఇస్తామని తెలపడం జరిగింది. ఇందిరమ్మ ఇళ్ళకి ఎనిమిది టిప్పులు ఇసుక ఫ్రీగా ఇస్తానని కాంగ్రెస్ గవర్నమెంట్ హామీ ఇచ్చింది. ఇప్పటివరకు ఏ ఒక్క ఇందిరమ్మ ఇంటికి ఫ్రీగా ఇసుక ఇవ్వడం లేదు. ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను ఇబ్బంది పాలు చేస్తుంది. ఒక టిప్పుకి నాలుగు వేలు లెక్క 8 టిప్పులకి 32,000 రూపాయలు ఇసుక కోసం ఇందిరమ్మ ఇంటికి ఇంటి యజమాని పెట్టుకోవడం జరుగుతుంది. కాంగ్రెస్ గవర్నమెంట్ ఫ్రీగా ఇస్తానని చెప్పిన ఉచిత ఇసుక ఇవ్వలేదు. ఇకనైనా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందజేయాలి. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ దళితుల సేవా సంఘం జిల్లా నాయకులు రెడ్డి పోగు కార్తీక్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జారె





**అశ్వారావుపేట**

అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణలి పరామర్శించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి అవసరమైన వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చికిత్స విషయంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూస్తానని, అవసరమైన సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు.

## బూర్గంపాడు నూతన సర్పంచ్‌ని సన్మానించిన చర్చి ఫాదర్ రేవరెడ్ ఎం.ఆశీర్వాదం

**బూర్గంపహాడ్**



బూర్గంపాడు గ్రామ పంచాయతీ ఎన్నికలలో నూతన విజయం పొంది సర్పంచ్ గా ఎన్నికైన మందా నాగరాజు ని స్థానిక గౌతమీపురం కాలనీలో గల గుడ్ సమా రిటన్ ఎవంజలికల్ లూథరన్ చర్చ్ సభ్యుల ఘనంగా సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సర్పంచ్ కుటుంబ సభ్యులకు మిఠాయితో నోరు తీపి చేసి మీరు ప్రజలకు ఎంతో మంచి చేస్తారని భావించి ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి మంద నాగరాజు ప్రజల మన్నలను పొందుతూ ఇంకా ఉన్నత శిఖరాలు అవరోదించాలని కోరుతున్నామని, ప్రజల అవసరాల నిమిత్తము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారాని భావిస్తూ పాస్టర్. రెవరెండ్. ఎం. ఆశీర్వాదం ప్రార్థన చేసి ఆశీర్వదించి అందించారు. అదేవిధంగా సంఘ సభ్యులు, సంఘ పెద్దలు అభినందలు తెలియజేశారు.

# లూయిస్ బ్రెయిలీ 217వ జయంతిని ఘనంగా జరిపిన మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

### - మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు మేకల లత ఆధ్వర్యంలో ఏర్పాటు

**మంగపేట**



అంధత్వాన్ని ఆయుధంగా మలచి అంధుల జీవితాలలో వెలుగులు నింపిన సాధకుడు, లూయిా బ్రెయిలీ జయంతి, ఎం.ఎస్.పి పార్టీ నాయకులు కేక్ కట్ చేసి విహెచ్పిఎస్ బ్లైండ్ డిజిబులిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మిట్టపల్లి నరేంద్ర స్థానిక సుభాష్ నగర్ కాలనీ నందు మహాజన సోషలిస్టు పార్టీ ఎం ఎస్ పి, మహాజన మహిళా సమైక్య ఎంఎంఎస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పీహెచ్పీఎస్ బ్లైండ్ డిజిబిలిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మిట్టపల్లి నరేంద్ర, హెచ్ఆర్పి జిల్లా ప్రధాన కార్యదర్శి, వికలాంగుల నాయకులు కిష్ట శ్రీనివాస్ రావు, మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత, ఎం ఎస్ పి జిల్లా సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్ లు మాట్లాడుతూ.. సమాజం చేత వంచనకు, అవమానాలకు, చీత్కారాలకు గురై అంధత్వాన్ని దూషించుకుంటూ మా బ్రతుకింతేనని నిరాశ నిస్పృహల్లో జీవించేవారు కృంగిపోకుండా, వారిలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని నింపి అందత్వం చూసే మనిషికే కానీ మనకు లేదని, మనం ఎందులో తక్కువ కాదని, మనం తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చేసి నిరూపించిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి సందర్భంగా కేక్ కటింగ్ చేయడం సంతోషకరమని అన్నారు. అంధుడై ఉండి కూడా తాను చదువుకొని, ఆ అందులకే లిపిని కనుకొని, తను చదువుకున్న విద్యాలయానికే ప్రొఫెసర్ గా నియమితులవ్వడం, ప్రపంచ దేశాలకే తను నేడు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయం అని గుర్తు చేశారు. అదే విధంగా లూయిస్ బ్రయిలీ ని స్ఫూర్తిగా తీసుకొని సామాజిక, ఆర్థిక, రాజకీయ ఫలాలు అందక చీకట్లో బతుకుతున్న అణగారిన, పీడిత వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహాజన నేత పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయమే ఏజెండాగా భారత రాజ్యాంగ ప్రవేశిక అమలునే మేనిఫెస్టోగా మహాజన సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని, మహాజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల ప్రజలను ఏకం చేసి ప్రతి గ్రామంలో మహాజన సోషలిస్టు పార్టీని నిర్మాణం చేసి, సమాజ అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, మేకల వెంకట్, గడ్డల ప్రవీణ్, హెచ్చు వంశీ, మోహిత్, ఎంఎంఎస్ జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క, బొడ్డు రమాదేవి, కొప్పుల నాగమణి, అలవాల రేవతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే

**మణుగూరు**



నేడు రోజురోజుకు పెరుగుతున్న ప్రజా సమస్యలు పరిష్కరించబడాలంటే కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబిర్ పాషా అన్నారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలు ఈనెల జనవరి 18వ తేదీన ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని మణుగూరు, నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున ఖమ్మం తరలిరావాలని ప్రజా ప్రచార జాత యాత్ర సందర్భంగా అంబేద్కర్ సెంటర్ లో దుగ్యాల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1925 ఉత్తర్ ప్రదేశ్ లో డిసెంబర్ 26న ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ ఈ దేశానికి స్వాతంత్రం పోరాటాలు నిర్వహించిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఈ దేశంలో అంటరానితనం, కుల వివక్ష జరగాలని, దున్నేవానికే భూమి కావాలని, వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లుపెంచాలని, సమానత్వం రావాలని పోరాటం కొనసాగించింది ఎర్రజెండా అన్నారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగించి సుమారు 4500 మంది ఆత్మబలి దానాలు అయ్యి, భూస్వాములకు దొరల పెట్టుబడిదారుల వ్యతిరేకంగా పోరాటం కొనసాగించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ దన్నారు. పేదల కోసం రైతుల కోసం కార్మికుల కోసం కష్టజీవుల కోసం ఎర్రజెండా నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఈ దేశంలో 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగినదని నేడు అధికారం లేకుండానే అనేక పార్టీలు కనుమరుగైపోతున్నాయని పేద ప్రజల అండ ఉండటం వల్లనే ఇంకా ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటల వల్ల అనేక హక్కులు, కార్మిక చట్టాలను సాధించుకున్నామని, వాటి స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే కనీవినీ ఎరుగని బహిరంగ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు, రాష్ట్ర దేశాల నుండి నెలపొలాల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరాలన్నారని, కావున ఈ బహిరంగ సభకు మణుగూరు పట్టణం మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా, లక్ష్మి కుమారి, జిల్లా సమితి సభ్యులు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ లక్ష్మీనారాయణ, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, జిల్లా సమితి సభ్యులు ఏడారి రమేష్, వేరుపుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వహణ భారంగా మారుతున్న సిఎస్సి సెంటర్లు!

### టార్గెట్లకు నిలియంగా మారిన సిఎస్సి సెంటర్లు
### సర్వీసులు కావాలని గగ్గోలు పెడుతున్న సిఎస్సి నిర్వాహకులు
### తెలంగాణ ప్రభుత్వ సర్వీసులు ఏవి లేకపోవడం ఇందుకు నిదర్శనం
### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఎస్సి సొసైటీ జాయింట్ సెక్రెటరీ ధరావత్ సాయి కృష్ణ

**టేకులపల్లి**



కేంద్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తూ ఉన్న సిఎస్సి సెంటర్లు కాలం చెల్లే స్థాయికి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిఎస్సి మీసేవ సెంటర్లను నిర్వహిస్తూ ఉన్నాయి. కానీ వీటి మధ్య సమన్వయ లోపం వలన రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న మీసేవ సెంటర్లకే అన్ని రకములైన సేవలను కేటాయిస్తూ ఉండటం వలన సిఎస్సి సెంటర్ నిర్వాహకులు నష్టాల బారిన పడుతున్నారు. అలాగే మీసేవ సెంటర్లు మండల స్థాయిలలో ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటాయి. కానీ సిఎస్సి సెంటర్లు ప్రతి గ్రామ స్థాయిలలో ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటాయి. అలాగే నిత్యం ప్రజల్లో మమేకంగా సిఎస్సి సెంటర్ నిర్వాహకులు ఉంటారు. కానీ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నటువంటి ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డ్, రైతు గుర్తింపు కార్డు లాంటి ప్రతి వాటిని మీసేవ సెంటర్లకు కేటాయించడం జరుగుతున్నది. తద్వారా సిఎస్సి సెంటర్ల నిర్వహణ అనేది సిఎస్సి సెంటర్ నిర్వాహకులకు భారంగా మారింది. సిఎస్సి విభాగం నందు ఉన్నటువంటి జిల్లా స్థాయి యంత్రాంగం కేవలం టార్గెట్లను మాత్రమే చూపిస్తూ ఉండటము, ఏ రకమైన కొత్త సర్వీస్ లు తీసుకుని రాకపోవడం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి ఇన్ని రోజులు అవుతున్నా నేటికి సిఎస్సి సెంటర్ విభాగంలో తెలంగాణ ప్రభుత్వం యొక్క సర్వీసులు లేకపోవడం గమనార్హం. అదేవిధంగా పక్కనే ఉన్న మిగిలిన రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం యొక్క సర్వీసులు సిఎస్సి విభాగాలలో ఉండడం పలు ప్రశ్నలకు తావు ఇస్తూ ఉన్నది. ఒక సిఎస్సి సెంటర్ నిర్వహణ కొరకు కనీసం రెండు లక్షల రూపాయల వ్యయంతో కూడుకున్న పరిస్థితి కలదు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో రిజిస్ట్రేషన్ జరిగి ఉన్నటువంటి సిఎస్సి సెంటర్లు కనీసం పదివేల పైచిలుకు కలవు. పరోక్షంగా యువత ఉపాధికి సిఎస్సి సెంటర్లు కూడా నిలయంగా ఉన్నాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న సర్వీసుల ప్రక్రియల మూలంగా సిఎస్సి సెంటర్ల నిర్వహణ భారంగా మారనుంది అనేది కొంతమంది సిఎస్సి సెంటర్ల నిర్వహిస్తున్నటువంటి విఎల్ఈ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి యంత్రాంగం ఈ విషయం మీద ఆలోచన చేయని పక్షంలో గ్రామస్థాయిలలో ప్రభుత్వ సంక్షేమం అనేది నిర్వీర్యంగా మారే అవకాశం కలదని సిఎస్సి సెంటర్లు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.